నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్ 1
ఆదివారం | జూన్ 09, 2024 | www.navatelangana.com

ముమ్మరంగా కొనసాగుతున్న 'జయశంకర్ బడిబాట' కార్యక్రమం



నవతెలంగాణ-వరంగల్

నగరంలోని ఏవీవీ ఉన్నత పాఠశాల (ఇంగ్లీష్ మీడి యం) ఉపాధ్యాయ బృందం గత నాలుగురోజుల నుండి జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డాక్టర్ ఎ.భుజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల పరిసర ప్రాంతాలైన పోతననగర్, రాజీవ్‌కాలనీ, ఓఎస్.నగర్, పాపయ్యపేట్, మట్టెవాడ, కుంటిభద్రయ్య గుడి ప్రాంతం, రామన్నపేట్, గోపాలస్వామిగుడిప్రాంతం, పాటక్ మహల్ ప్రాంతాల్లో వాడవాడలా బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు ఏవీవీ పాఠశాల ఔన్నత్యాన్ని వివరిస్తూ, బడిఈడు పిల్లలను ఏవీవీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చేరేలా ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డాక్టర్ ఎ.భుజేందర్ రెడ్డి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ టి.వాసుదేవులు, ఉపాధ్యాయులు ఎ.సంధ్యారాణి, ఎస్.నవీన్, జి.భాగ్యలక్ష్మి,ఇ.వెంకటేశ్వర్లు,జి.వీరేశలింగం,జి.సుధారాణి, వి.రమాదేవి, చిలుక భాస్కర్, శ్రీకాంత్,రాజేశ్వరి, శశాంక్‌లు పాల్గొన్నారు.

పర్వతగిరి : సర్కారు బడుల్లోనే సక్కని విద్య లభిస్తుందని సామాజిక కార్యకర్త స్కైలాబ్ బాబు తెలిపారు. మండలం లోని నారాయణపురం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ బాబు,ఉపాధ్యాయులతో కలిసి బడిఈడు పిల్లల తల్లిదండ్రుల ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పి.సురేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో మీ పిల్లల్ని చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, తిరుపతి సంపత్, అరవింద్‌కుమార్, ఎస్.గిరిజ, రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు.

నేడు గ్రూప్-1 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



- 10 గంటలకు గేట్లు బంద్
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రూప్ 1 పరీక్షలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం 9.00 గంటల నుండే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 10.00 గంటలకు గేట్లు మూసివేస్తారు. ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. గత వారం రోజులుగా అధికార యంత్రాంగం ఈ పరీక్షలకు సంబంధించి తగు ఏర్పాట్లు చేయడంలో మునిగిపోయింది. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ఐడి కార్డుతోపాటు హాల్ టికెట్‌ను విధిగా తీసుకురావాలని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థులు విధిగా నియమ, నిబంధనలు, సూచనలు చదవాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్, హన్మకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో మాత్రమే గ్రూప్ 1 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ములుగు జిల్లాలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయలేదు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం 6.00 గంటల నుండి అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను అమలు చేయనున్నారు. వరంగల్ జిల్లాలో 17 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 9,092 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. హన్మకొండ జిల్లాలో 45 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. 22 వేల 665 మంది అభ్యర్థులు ఇక్కడ పరీక్ష రాస్తున్నారు. జనగామ జిల్లాలో 14 కేంద్రాలు 3,697 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 12 పరీక్షా కేంద్రాల్లో 4,412 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. భూపాలపల్లి జిల్లాలో 17 పరీక్షా కేంద్రాల్లో 4,473 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారు. ములుగు జిల్లాలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయలేదు.

అభ్యర్థులకు సూచనలు

- అభ్యర్థులు నలుపు లేదా నీలం రంగు బాల్ పెన్నులు మాత్రమే వినియోగించాలి.
- ఒరిజినల్‌లో కూడిన హాల్ టికెట్‌ను మాత్రమే తీసుకువెళ్లాలి. హాల్ టికెట్‌పై సూచించబడిన చోట ఫోటోను అతికించాలి.
- కలర్ ప్రింటర్‌తో ఎ4 సైజ్ పేపర్‌పై ముద్రించబడిన హాల్ టికెట్‌ను మాత్రమే అనుమతిస్తారు.
- పరీక్షా కేంద్రానికి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉదాహరణకు మొబైల్స్ వాచ్ తదితర పరికరాలు తీసుకురాకూడదు.
- బయోమెట్రిక్ థంబ్ ఇంప్రెషన్ ద్వారా అటెండెన్స్ తీసుకుంటారు. మహిళలు చేతి వేళ్లకు గోరింటాకు లాంటివి పెట్టుకోకూడదు.
- పరీక్షా కేంద్రానికి చెప్పులు మాత్రమే వేసుకొని రావాలి. షూస్ వేసుకోవడానికి అనుమతి లేదు.
- పరీక్షా కేంద్రాలు ఉదయం 9.00 గంటలకే ప్రారంభమవుతాయి.
- ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహిస్తారు.
- అభ్యర్థుల పరీక్షా సమయం నిర్ధారించడానికి సెంటర్ ఇన్విజిలేటర్ చేతి గడియారం ధరించి రావచ్చు.
- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌పై మూడునెలల్లోపు దిగిన పాస్‌ఫోటోలు అతికించి తీసుకురావాలి.
- పిడబ్ల్యుడి అభ్యర్థులకు వారి హాల్‌టికెట్‌లో పేర్కొన్న విధంగా పరీక్ష రాసేందుకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు.

ఈసెట్ 2024 ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం



నవతెలంగాణ-వరంగల్

రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీ, ఇతర ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా బీ టెక్ రెండవ సంవత్సరంలో ప్రవేశం కోసం పాలిటెక్నిక్ డిప్లొమా చదివిన వారికి నిర్వహించిన ఈసెట్-2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ తెలంగాణ ఉన్నత విద్య మండలి శనివారం నుండి చేపడుతున్నట్లు వరంగల్ జిల్లా హెల్ప్ లైన్‌సెంటర్ క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ బైరి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ కౌన్సిలింగ్‌లో భాగంగా వరంగల్ జిల్లా కేంద్రంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్, వరంగల్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్, సుబేదారి, హనుమకొండ నందు విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన కొరకు స్లాట్ ఈ నెల 8 నుండి 11 వరకు బుక్ చేసుకోవచ్చు అని తెలిపారు. స్లాట్ బుక్ చేసు కొన్న విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 10 నుండి 12 వరకు జరుగుతుంది అని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఏదైనా సమయంలో స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ చేసుకొన్న సమయానికి 30నిమిషాల ముందు కౌన్సిలింగ్ కేంద్రం వద్ద రిపోర్ట్ చేయవలసి ఉంటుం దన్నారు. విద్యార్థులు తమతో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ అనగా ఈసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో,డిప్లొమా ప్రొవిజనల్,డిప్లొమా మెమో, ఏడవ తరగతి నుండి డిప్లొమా వరకు స్టడి సర్టి ఫికెట్లు, కులం,ఆదాయంతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీ కూడా తీసుకొని రావలసి ఉంటుందని తెలిపారు.

కేంద్రంలో కాంగ్రెస్‌దే నైతిక విజయం

నవతెలంగాణ-చెన్నారావుపేట

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే నైతిక విజయం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజెపికి డిపాజిట్లు రాని నియోజకవర్గంలో విజయతీరానికి చేర్చి బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బిడ్డ కవిత జైలు నుంచి బయటకు తీసుకు రావడానికి తెలంగాణ రాష్ట్ర గౌరవాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టారన్నారు. రాబోయే రోజుల్లో ఏపీలో రాజకీయాలు మారిపోతాయని కేంద్రంలోని బిజెపికి గడ్డుకాలం ఏర్పడక తప్పదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ చేసుకున్న రహస్య ఒప్పందం వల్లే తెలంగాణ లో బీఆర్ఎస్ తుడిచి పెట్టుకుపోయిందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఏమాత్రం ప్రభావం చూపని బీజేపీ ఎంపీ సీట్లలో ఎలా గెలిచిందని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేసి ఓడిపోయి పార్లమెంటులో గెలవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బీజేపీ పార్లమెంటులో 400 సీట్లు నినాదంతో ప్రచారం చేసి 290 కే పరిమితం కావడానికి ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి టిడిపి నేత చంద్రబాబు, నితీష్ కుమార్ నుంచి ఏనాటికైనా ముప్పు తప్పదని హెచ్చరించారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో యూనిఫాం, పుస్తక విక్రయాలు నిలిపివేయాలి

నవతెలంగాణ-చెన్నారావుపేట

ప్రైవేటు కార్పొరేటు విద్యసంస్థల్లో యూనిఫామ్, షూస్, బుక్స్ వంటివి అమ్మకాలు చేయవద్దని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ డిమాండ్ చేశారు. స్టేట్ డీఈవో ఇచ్చిన సర్క్యులేషన్ ప్రకారం వరంగల్ జిల్లాలో కూడా అమలు చేయాలని ప్రైవేట్ స్కూళ్లలో యూనిఫామ్, షూ, బెల్టు, స్టేషనరీ, పుస్తకాలు వంటివి అమ్మడం నిషేధమన్నారు. ప్రైవేట్ కార్పొరేటు విద్య సంస్థలో విచ్చలవిడిగా ఫీజులను అమలు చేస్తూ పిల్లల తల్లిదండ్రుల నుంచి పుస్తకాలు పేర్లతో ముక్కు పిండి వసూలు చేస్తున్నారని నీధుల దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో పాఠ్యపుస్తకాలు అమ్మడం అనుమతులు లేని పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎఫ్ డీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

చింతనెక్కొండలో సంబరాలు

నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపొందిన సందర్భంగా శనివారం మండలం చింత నెక్కొండలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, నాయకులు సిహెచ్.చలపతిరావు, మల్లన్న టీమ్ మండల ఇన్చార్జి తౌడోజు శ్రావణ్, వంగ సాయిలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కావ్యను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చౌటపెల్లి గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ మిట్టపెల్లి సాయిలు, చౌటపెల్లి పీఏసీఎస్ డైరెక్టర్ మట్టపల్లి గోపాల్ రావు శనివారం వరంగల్ ఎంపీగా కడియం కావ్య అధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్యాంపు కార్యాలయంలో కడియం శ్రీహరికి మరియు కడియం కావ్య పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలం లోని దౌలత్ నగర్‌లో కత్తుల కట్టయ్య శనివారం మరణించగా చౌటపల్లి సొసైటీ చైర్మన్ గొర్రె దేవేందర్,జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ సర్వర్, కాంగ్రెస్ నాయకులు బందెల వెంకన్న,దొనికి కొమురయ్య, ఆడెపు కుమార్, బత్తిని సాంబయ్య తదితరులతో కలిసి సంతాపం తెలిపి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు గ్రామ ఫరపతి సంఘం డబ్బులు అందజేశారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని దౌలత్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త కత్తుల కట్టయ్య శనివారం మరణించగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.అలాగే మండల పరిధిలోని కల్లెడ, గోపనపల్లి, అనంతారం గ్రామంలో ఇటీవల మరణించిన రావుల వీరయ్య, జేరిపోతుల రజిత,ఎర్రబోయిన సాయిలు,బురికి సాయిలు , గుజ్జ పుష్పలత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, మండల, గ్రామ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని వడ్లకొండలో శ్రీ రంగనాయకుల స్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కొరకు వడ్లకొండకు చెందిన కందికట్ల కొమరమ్మ రూ.5,016లు విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులు, మాజీ సర్పంచ్ అమడగాని రాజు యాదవ్‌కు అందజేశారు.

కాంగ్రెస్ పార్లమెంటరీ సమావేశానికి హాజరైన ఎంపీ డాక్టర్ కావ్య



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ సమావేశానికి హాజరైన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్య శనివారం మధ్యాహ్నం న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీని కాంగ్రెస్‌పార్టీ పక్షనేతగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన పార్లమెంట్ సభ్యులకు ఏర్పాటు చేసిన విందులో కావ్య పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్ అందజేతలో వరంగల్ జిల్లా ముందంజ



- నిర్దేశిత గడువులోపే పాఠశాలలకు చేరిన యూనిఫాం
- సమర్థవంతంగా ప్రతిభను చాటిన వివో మహిళలు
- 21 రోజుల్లోనే యూనిఫామ్ సిద్ధం
- కలెక్టర్, డీఆర్‌డీఓలను అభినందించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా

నవతెలంగాణ-వరంగల్

నిర్దేశించిన గడువులోపే ప్రభుత్వ విద్యాసంస్థలకు సమైక్య మహిళల చేత స్కూల్ యూనిఫామ్ కు ట్టించి అందజేసి జిల్లాను రాష్ట్రంలోనే ముందం జ లో ఉంచుటకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ పి. ప్రావీ ణ్య, డీఆర్డిఓ కౌసల్యాదేవి లను పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా వాట్సప్ ద్వారా అభినందించినట్లు డీఆర్‌డీఓ కౌసల్య దేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యసించే విద్యార్థుల యూనిఫామ్‌ను ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం మొట్ట మొదటిసారిగా ప్రయోగాత్మకంగా (సెర్ప్) గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల మహిళ లకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని తెలి పారు. ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ ప్రావిణ్య సలహాలు సూచనల మేరకు గత నెల15న విద్యాశాఖ అధికారుల నుండి యూనిఫామ్ క్లాత్ తీసుకొని జూన్ 7 వరకే జిల్లా వ్యాప్తంగా ఉన్న 38,020 మంది విద్యార్థుల యూనిఫామ్‌ను కేవలం 21రోజుల్లోనే తయారు చేయించి ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు.

నిర్దేశించిన గడువులోపే సమర్థవంతంగా పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ అందజేయుటకు అన్ని విధాలుగా పూర్తి సహాయ సహకారాలు అందించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మండల, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు అన్ని విభాగాల డీపీఎంలకు, ఏపీఎంలకు, సీసీలకు, మాస్టర్ ట్రైనర్స్ కు ఈ సందర్భంగా అభినందించారు.

ముగ్గురు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠా అరెస్టు



- రూ.50 లక్షల విలువైన 192 కిలోల గంజాయి పట్టివేత
- కారు, మూడు సెల్‌ఫోన్‌ల స్వాధీనం

నవతెలంగాణ-హసన్‌పర్తి

భారీ స్థాయిలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసారు. వీరి నుండి సుమారు రూ.50 లక్షల విలువ గల 192 కిలోల గంజాయితో పాటు ఒక కారు మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ప్రస్తుతం పెగడపల్లి డబ్బాల వద్ద నివాసం ఉంటున్న భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లికి చెందిన గజ్జి సహదేవ్, మహారాష్ట్ర షిరిడి, అహ్మద్‌నగర్ సోమన్వేర్‌కు చెందిన జె.యోగేశ్వర్, మహారాష్ట్ర బీడ్ జిల్లా కలాట్‌వాడికి చెందిన సోమనదత్ రాందాస్ కాలాటి కాగా మరో ముగ్గురు నిందితులు ఒరిస్సాకు చెందిన పాండు నివాసం కూరమనూర్, మహారాష్ట్ర పంచవటికి చెందిన లక్ష్మీ తాటేనివాసం, వికాస్ తాటే నివాసం ఉన్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా వివరాలను వెల్లడించారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు గజ్జి సహదేవ్ కా రు డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తుండగా ఇదే నిందితుడికి మిగితా నిందితులతో పరిచయం ఏర్పడి ఈ పరిచయం కాస్త స్నేహంగా మారింది. వీరందరు సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో గత కొద్ది రోజులుగా ఆంధ్రప్రదేశ్ లోని చింతూరు మండలం తునగొండ గ్రామ పరిసరాల నుండి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు రహస్యంగా తరలించి గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించేవారు. ఇదే తరహాలో గజ్జి సహదేవ్ పోలీసులు అరెస్టు చేసిన మిగితా నిందితులతో కలిసి తునుగొండలో 192 కిలోల గంజాయిని కోనుగోలు చేసి దానిని రెండుకిలోల చొప్పున 96 ప్యాకెట్లలో ప్యాక్ చేసి కారులో ఎవరికి అనుమానం రాకుండా భద్రపర్చి చింతూరు నుండి ఏటూరునాగారం, ములుగు మీదుగా మహారాష్ట్రకు నిందితులు కారులో గంజాయిని తరలిస్తున్నారు.

పోలీసులకు అందిన పక్కా సమచారంతో శనివారం ఉదయం టాస్క్‌ఫోర్స్, దామెర పోలీసులు దామెర పోలీసు స్టేషన్ పరిధి శ్రీహర్ష స్కూల్ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను గుర్తించిన నిందితులు కారులో తప్పించుకుని పారిపోయే ప్రయత్నంచేశారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అప్రమత్తమై నిందితుల కారును అడ్డగించి కారును తనిఖీ చేయగా కారులో గంజాయి ప్యాకేట్లను గుర్తించిన పోలీసులు కారులో ప్రయాణిస్తున్న నిందితులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో గజ్జి సహదేవ్‌పై గతంలో హనుమకొండ, ఏనుకూరు, పర్కాల పోలీస్ స్టేషన్ లలో గంజాయి స్మగ్లింగ్ చేస్తుండగా పట్టుబడ్డ కేసులు నమోదైనట్లు సీపీ తెలిపారు.

ఈ ముఠా సభ్యులను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్లు సార్లరాజు, ఎస్.రవికుమార్,ఎస్ఐలు నిస్సార్‌పాషా, శరత్‌కుమార్, దామెర ఎస్ఐ అశోక్, ఏ.ఏ.ఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుళ్ళు అశోక్, కష్ణ, కానిస్టేబుళ్ళు సురేష్, శ్రీనివాస్, అంజయ్య, విజయ్ కుమార్, శ్రీనివాస్, అప్జల్‌ఖాన్, సతీష్, నాగరాజులను పోలీస్ కమిషనర్ అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఆత్మకూరు



మండలంలోని పెంచికలపేటకు చెందిన సిరికొండ జంపయ్య ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సుమన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కలకోట్ల రాజేష్, నరిగే రంజీత్‌లు జంపయ్య కుటుంబానికి అండగా ఉంటానని ముందుకొచ్చి మృతుని కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో విజయ్, శ్రీకాంత్, ప్రసన్న, రవి, విజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఎంఎన్‌సీ కంపెనీతో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పరస్పర ఒప్పందం



నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలతో హైదరాబాద్ కాప్టియస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంఎన్‌సీ కంపెనీకి మధ్య శనివారం అవగాహన ఒప్పందం(ఎం.ఓ.యూ) కుదిరినట్లు కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. కిట్స్ సిల్వర్ జూబ్లీ సెమినార్ హాలులో కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి కంపెనీసర్వీస్ డెలివరి హెడ్ హవీష్‌కొలచిన సంయుక్తంగా ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు. ఈ ఒప్పందం నూతన పరిశోధనలకు, వ్యవస్థాపకత, పరిశ్రమ నిర్మాణ నైపుణ్య, సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహించే సాంకేతిక విద్యక్లౌడ్ ఆధారిత సర్వీస్ ప్రొవైడర్, మేనేజ్‌మెంట్ వంటి పలు సేవలను అభివృద్ధికి తోడ్పడుతుందని వారు తెలిపారు. అనంతరం హవీష్ కొలచిన మాట్లాడుతూ సర్వీస్‌నౌలో స్టార్టప్ సపోర్ట్, విద్యార్థులకు ప్రీ ప్లేస్‌మెంట్ శిక్షణ, అడ్వైజరీ, గో-టు-మార్కెట్ స్ట్రాటజీ, సోషల్ డిజిటల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ అండ్‌ఫండ్ వంటి అంశాలకు అనుకూలమైన పరిష్కారాలను అందిస్తున్నామని చెప్పారు. పెంచడం, కప్టివ్ లీడర్‌ల బందం ద్వారా నిర్మించడం, పని చేయడం అనేది మానినాదమన్నారు. ఇది అధిక ప్యాకేజీ ఉపాధి కోసం విద్యార్థి సంఘంలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత మరియు సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు. కిట్స్‌వరంగల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి, కాప్టియస్ నుండి సర్వీస్ డెలివరీ హెడ్ హవీష్ కొలచిన, ఈ సంస్థ నుండి విద్యార్థులకు శిక్షణ, నియామకం జరుగుతుందని ధృవీకరిస్తూ అవగాహన ఒప్పందాన్ని మార్చుకున్నారు.

ఈ కార్యక్రమం విద్యార్థులకు విలువైన సాంకేతిక నైపుణ్యాలను అందించడం ద్వారా వారి ఉపాధిని పెంపొందిస్తుందని డాక్టర్ కె.అశోక రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం 7 బిలియన్ల విలువ కలిగిన ఈ సాంకేతికత త్వరలో 30 బిలియన్లకు పెరుగుతుందని కాప్టియస్ ప్రతినిధి పేర్కొన్నారు. కిట్స్ వరంగల్ కాప్టియస్ మధ్య ఈ అవగాహనా ఒప్పందం సాంకేతికత బదిలీని పెంచడం, విద్యార్థుల ఉపాధిని పెంచడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. స్టార్టప్‌లను నిర్మించేందుకు అధునాతన వినూత్న సాంకేతికతలపై శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

కాప్టియస్ హైదరాబాద్ సర్వీస్ డెలివరీ సీనియర్ లీడ్ కన్సల్టెంట్ అల్లం శరత్‌కుమార్, వివిధ కిట్స్ వరంగల్ కమ్యూనిటీ సభ్యులతో సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఉదయ్ కోతతో సహా కాప్టియస్ బందం అంగీకరించినట్లు కిట్స్ యాజమాన్యం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో కిట్స్ కోశాధికారి పి.నారాయణ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోమల్ రెడ్డి, శిక్షణ, ప్లేస్‌మెంట్స్ డీన్ పురందర్, డీన్ ప్రొఫెసర్ వేణుమాధవ్, కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ కిరణ్ కుమార్, డాక్టర్ చంద్రబాయి, శిక్షకులు ధనుష్, డి.శరత్, పి.సింధూర, పి.అరుణకుమారి, డీన్స్ ఫిజికల్ సైన్సెస్ విభాగాధిపతి, పీఆర్ఓ డాక్టర్ డి.ప్రభాకరచారి సిబ్బంది పాల్గొన్నారు.

రామోజీరావు పార్థివదేహానికి కడియం నివాళులు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావు మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం రామోజీరావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అక్షర యోధుడు, పత్రికా రంగానికి నూతన ఒరవడిని సృష్టించిన గొప్ప మహానుభావుడు రామోజీరావు అని కొనియాడారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో ఎదిగిన గొప్ప దార్శినికుడు రామోజీరావు అన్నారు.

మీడియా రంగంలో, సినిమా రంగంలో ఆయన అందించిన సేవలు మారువలేనివని, రామోజీరావును కోల్పోవడం దేశానికి తీరని లోటని తెలిపారు.

వైబ్రెంట్ అకాడమీ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ టెస్ట్

- వైబ్రెంట్ అకాడమి డైరెక్టర్ సీహెచ్.రాజేందర్ రెడ్డి, అకాడమిక్ హెడ్ పులి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

దేశంలో ప్రతిష్టత్మాకమైన ఐఐటి, నీట్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ వైబ్రాంట్ అకాడమీ ఆధ్వర్యంలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ కొరకు స్కాలర్షిప్ టెస్ట్ నేడు ఉదయం 11గంటల నుండి 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వైబ్రెంట్ అకాడామి డైరెక్టర్ సిహెచ్ రాజేందర్ రెడ్డి , అకాడమిక్ హెడ్ పులి శ్రీనివాస్ గౌడ్ లు తెలిపారు. ఈ నెల 14 నుండి మొదటి బ్యాచ్ నీట్ 2025 కోచింగ్ కొరకు తరగతులను ప్రారంభించే పోస్టర్ ను ఆవిష్కరించారు. . శనివారం నక్కలగుట్టలోని వైబ్రంట్ అకాడమీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమిక్ హెడ్ పులి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నేడు నీట్ 2025 కోచింగ్ కొరకు స్కాలర్షిప్ టెస్ట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని కావున ఇంటర్ విద్యార్థులు, నీట్ 2024కు హాజరైనటువంటి విద్యార్థులు ఈ పరీక్షకు హాజరై ఫీజులో రాయితీ పొందవచ్చు అని తెలిపారు.ఈ ప్రోగ్రాం కోట రాజస్థాన్ కు చెందిన అనుభవజ్ఞులైన సీనియర్ అధ్యపకులతో విద్యాబోదన, కోట సెంట్రల్ ఆఫీస్ నుండె పాఠ్యపుస్తకాలతో పాటు ప్రతివారం నిర్వహించే వారంత పరీక్షలు, నెలవారిగా నిర్వహించే పరీక్షలు వైబ్రెంట్ కోట సెంట్రల్ ఆఫీస్ నుండి పంపించడం జరుగుతుంది అని వారు పేర్కొన్నారు. వైబ్రెంట్ అకాడామి ద్వారా 16 సంవత్సరాల నుండి అనేక మంది విద్యార్థులను డాక్టర్లుగా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైబ్రంట్ అకాడామి స్టాప్ గుండాల రాజు, రామ్ గుమ్మడి, నారయణసింగ్, డి. రాజు, విజయ్ కుమార్, శ్రీనాథ్, అరుణ్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులు ఫిష్‌పాండ్స్ నిర్మించుకోవాలి

- ఈజీఎస్ ఏపీవో కీర్తి అనిత

నవతెలంగాణ-శాయంపేట

రైతులు సాధారణ పంటలతో పాటు తమ పంట క్షేత్రాలలో ఫిష్ పాండ్స్ నిర్మాణం చేపట్టుకొని అధిక లాభాలు గడించాలని ఈజీఎస్ ఏపీఓ కీర్తి అనిత శనివారం తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతులు తమ పంట క్షేత్రాలలో 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో ఫిష్‌పాండ్స్ నిర్మాణం చేపట్టుకున్నట్లయితే 100శాతం కూలీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయబడుతుందన్నారు. మత్స్య శాఖ నుండి ఉచితంగా చేపపిల్లలను అందించడం జరుగుతుందన్నారు. చేపలను పెంచి విక్రయించుకున్నట్లయితే అధిక లాభాలు గడించవచ్చని, రైతులందరూ ఫిష్ పాండ్స్ పై దృష్టి సారించాలని తెలిపారు. వీటితో పాటు ఫామ్ పౌండ్స్ నిర్మాణం కూడా చేపట్టుకోవాలని రైతులకు సూచించారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

నవతెలంగాణ-శాయంపేట

ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం మండల అధ్యక్షులు తీన్మార్ జై, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, చింతల రవిపాల్, మామిడి సుదర్శన్, బాసాని మార్కండేయ, వినుకొండ శంకరాచారి, మారపల్లి రాజు, కట్టయ్య, బోల్లపల్లి సదానందం ఎండి రఫీ, సదయ్య, సాదిక్, రాజేందర్ పాల్గొన్నారు.

మృగశిర కార్తెతో చేపలకు డిమాండ్

నవతెలంగాణ-శాయంపేట



మగశిర కార్తె శనివారం ప్రారంభం కావడంతో మత్స్య కార్మికులు చేపల రేట్లను అమాంతంగా పెంచేశారు. మృగశిర కార్తె చేపలను తినాలని నానుడి ఉండడం, అస్తమా వ్యాధిగ్రస్తులకు చేపల మందు పంపిణీ జరుగుతుండడంతో చేపలకు డిమాండ్ పెరిగింది. మండల కేంద్రంలో చేపల వ్యాపా రస్తులు తెల్ల చేపలు ప్రతిరోజు కిలోకు 130 నుండి 150 వరకు విక్రయాలు చేపడుతుండగా, శనివారం మగశిర కార్తెను పురస్కరించుకొని కిలో 180 చొప్పున విక్రయాలు చేపట్టారు. చేపల కాంట్రాక్టర్లే చెరువు వద్ద కిలో 150 కి అమ్మకాలు చేపడుతున్నారని, రూ.30లు లాభం చూసుకొని రూ.150కి విక్రయిస్తున్నట్లు చేపల వ్యాపారస్తులు తెలపడం గమనార్హం. శనివారం చాలా మంది ఉపవాసాలు ఉన్నప్పటికీ, మృగశిర కార్తెను పురస్కరించుకొని అధిక రేటు చెల్లించి చేపల కొనుగోళ్లకు ప్రజలు ఎగబడ్డారు.

ఆత్మకూర్ : మృగశిరకార్తె ఆరంభం రోజున చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని, ఉబ్బసం, ఆయాసం వంటి వ్యాధులు దూరమవుతాయని నమ్మకం. మండలంలోని హౌజుబుజుర్గు గ్రామంలో కటాక్ష పూర్ చెరువు లో గత పది రోజులుగా మత్స్యకారులు చేపల పడుతున్నారు. ఇదే క్రమంలో మగశిర కార్తె ఆరంభం కావడంతో సిటీ వాసులు చేపలు కొనుగోలుకై కటాక్ష పూర్ చెరువులో నగర ప్రజలు పెద్దఎత్తున రావడంతో చెరువు కోలాహలంగా మారింది. ఈ క్రమంలో మత్స్యకారులు కిలో రూ.200 చొప్పున విక్రయించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతుమృతి

నవతెలంగాణ-ఆత్మకూరు



వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు బా విలో పడి మృతి చెందిన విషాద సంఘటన ఆత్మకూరు మండలంలోని నీరుకు ళ్ల చోటుచేసుకుంది. ఎస్సై రాజేష్‌రెడ్డి కథనం ప్రకారం మండలంలోని నీరుకుళ్ల గ్రామానికి చెందిన బిట్ల ప్రేమ్‌చందర్ (45) శనివారం తన వ్యవసా య చేనులో పత్తి గింజలు వేయడానికి వెళ్లారు. బావి చుట్టూ ఉన్న గడ్డిపై గడ్డి మందు పిచికారి చేయడానికి వ్యవసాయ బావి నుండి నీరు తోడే క్రమంలో కాలుజారి ప్రమాదవశాత్తు బావిలో పడి ప్రేమ్ చందర్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య బిట్ల అనుషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

నవతెలంగాణ-శాయంపేట

శాయంపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో కార్మిక శాఖ, సిఎస్సి హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్ కార్డుదారులకు 50 రకాల పైగా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ కందగట్ల రవి శనివారం తెలిపారు. లేబర్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఆదివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, హెల్త్ కార్డు జిరాక్స్‌లతో శిబిరాన్ని సంప్రదించాలని కోరారు.

రసాయనశాస్త్ర ఆసక్తి పరిశోధనకు నాంది



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

రసాయన శాస్త్ర ఆసక్తి పరిశోధనకు నాంది" అని కాకతీయ విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య ఎస్.వాసుదేవరెడ్డి అన్నారు. రసాయనశాస్త్ర విభాగ సెమినార్‌హాల్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల 3వారాల ఇండస్ట్రియల్ ట్రెనింగ్ లో భాగంగా అధ్యాపకులకు రసాయన శాస్త్రంలో ప్రస్తుతం వస్తున్న విస్తృతమార్పులు వివరించారు. విద్యార్థికి ఆసక్తి కల్పించటంతో సృజన మొదలు అవుతుంది, నేచర్‌ను చూసి అతనిలో పరిశోధనలకు అంకురార్పణ జరుగుతుంది అన్నారు, ప్రస్తుతం వస్తున్నా వివిధ వ్యాధులు, రోగాల బారినుండి పడకుండా సహజ సిద్ధంగా ప్రకృతితో ఎలా మెలగాలి అనేది తెలుస్తుంది అన్నారు, ఫీల్డ్ నుంచి ప్రయోగ శాలకు, అనంతరం తరగతి గది కి అనుసంధానం జరగాలి అన్నారు, సహజ సిద్దమైన పరిస్థితులు కల్పించాలి అన్నారు, విద్యార్థి ఒక్కసారి తన ఇష్టాన్ని చూపెడితే చాలు అన్నారు. ప్రస్తుతం బోధనా, ప్రయోగ పద్దతిలో విస్తత మార్పులు చోటు చేసుకున్నాయి అన్నారు, తదనుగుణంగా అధ్యాపకుల సరళి లో కుడా మార్పులు రావాలి అన్నారు.

శక్తి వినియోగం, దాని ద్వార కణాల్లో వచ్చే మార్పులు వివరించారు, విభాగ అధిపతి ఆచార్య టి.సవితాజ్యోత్స్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ విధానాన్ని రద్దు చేయాలి

- టెస్కో ద్వారా చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి
- సొసైటీలకు క్యాష్ క్రెడిట్ మాఫీ చేయాలి
- మంత్రి తుమ్మలకు వీరమోహన్ నివేదిక అందజేత



నవతెలంగాణ-శాయంపేట

చేనేత మగ్గాలకు జియో ట్యాగింగ్ చేసే విధానాన్ని రద్దుచేసి సొసైటీలను కాపాడాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చేనేత సహకార సంఘాలను ఈనెల 3న చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధి బందం సందర్శించి చేనేత వస్త్రాల ఉత్పత్తులు, కార్మికుల స్థితిగతులపై క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. శనివారం వ్యవసాయ, చేనేత సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన ఛాంబర్ లో చేనేత ఐక్యవేదిక ప్రతినిధి బందం నివేదికను అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీర మోహన్ మాట్లాడుతూ చేనేత సొసైటీలలో ఉత్పత్తి అయిన వస్త్రాలను గత ఆరు నెలలుగా టేస్కో ఖరీదు చేయకపోవడంతో, కుప్పలు తేప్పలుగా వస్త్రాలు పేరుకు పోయాయని అన్నారు. గతంలో సొసైటీలకు చెల్లించాల్సిన బకాయిలు లక్షల్లో ఉండడంతో, నిధులు లేక సొసైటీలు మూతపడే ప్రమాదంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సొసైటీలో తయారైన టవల్స్, లుంగీలు, డ్రెస్ మెటీరియల్స్, బెడ్ షీట్స్, చేతి రుమాలు, వివిధ రకాల వస్త్రాలు ఆకర్షణీయంగా ఉత్పత్తులు ఉన్నప్పటికీ ఆదరించే వారు లేక ప్రాచీనమైన కళ చేనేత కనుమరుగయ్యే పరిస్థితులు ఉందన్నారు. గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేనేత నిర్వీర్యం అయిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా చేనేతకు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సొసైటీలలో నిలువ ఉన్న వస్త్రాలను వెంటనే కొనుగోలు చేయాలని, క్యాష్ క్రెడిట్ మాఫీ చేయాలని, సొసైటీలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని, సంఘ సభ్యులందరికీ ఓటు హక్కు కల్పించాలని, రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులకు హౌస్ కం వర్క్ షెడ్డులు మంజూరి చేయాలని, టెస్కోకు ప్రాణప్రతిష్ట చేసి పాలకమండలిని ఏర్పాటు చేయాలని, నూలు సబ్సిడీ విధానంలో మార్పులు చేర్పులు చేసి చేనేత కార్మికులకు క్షేత్రస్థాయిలో నేరుగా అందే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు కోమటిపల్లి సదానందం, సీనియర్ ఉపాధ్యక్షులు రాపోలు వెంకటేశ్వర్లు, క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొంగరి నారాయణ, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షురాలు చిందం సునీత, మహిళా కార్యదర్శి బీమానాదుల శారద, మీడియా కార్యదర్శి రావిరాల శ్రీనివాస్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కుడికాల భాస్కర్, సిరిసిల్ల సురేష్, పెండెం శివానందం పాల్గొన్నారు.

రామోజీరావుకు ప్రెస్‌క్లబ్‌లో ఘన నివాళి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు శనివారం ఉదయం మరణించగా హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో అధ్యక్షుడు వేముల నాగరాజు , కమిటీ సభ్యులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు మీడియా రంగంలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించుకున్నారన్నారు. రామోజీరావు ఈనాడు దినపత్రిక ద్వారా తన కలంతో ఒక సమాజాన్ని ప్రభావితం చేసిన ఆయన ఇక లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనదన్నారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజె %స్త్ర%143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు, కోశాధికారి అమర్, గోకారపు శ్యామ్, ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, కార్యవర్గ సభ్యులు సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ : ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావుకు శనివారం కాశిబుగ్గ జంక్షన్ లో 19వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో నాయకులు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ మాట్లాడుతూ మీడియా రంగంలో రామోజీరావు అంచలంచలుగా ఎదుగుతూ ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రామోజీరావు మరణం మీడియా రంగానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొమ్ముల సందీప్ కుమార్, కుసుమ సతీష్, నీలం శ్రీనివాస్, ఎండి.మాక్బుల్, కట్కూరి అవినాష్, పోలేపాక సుధాకర్, నాగరాజు, ప్రదీప్, యాకుబ్, హరి ప్రసాద్, శేషు, వెంకన్న ప్రభాకర్, శ్రీనివాస్, పూర్ణిందర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ బీఆర్ భగవాన్‌దాస్ 94వ జయంతి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కామ్రేడ్ బీఆర్.భగవాన్ దాస్ 94వ జయంతి సందర్భంగా అశోక జంక్షన్ వద్ద శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మీడియా తో ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ నగరానికి నేడు మంచి నీళ్లు వచ్చాయంటే కామ్రేడ్ బి ఆర్ భగవాన్ దాస్ పోరాటాల ఫలితమేనని అని మరోవైపు వరంగల్ జిల్లాలో కార్మిక సంఘాలను స్థాపించి వారికి ఉపాధి అవకాశాలను కల్పించిన ఘనత భగవాన్‌దాస్‌దే అనుకొనియాడుతూ హమాలి..రిక్షా..ట్రైలర్ వర్కర్స్ ఒక్కటేమిటి వరంగల్ నగరంలో కార్మిక సంఘాల నిర్మాణం చేసి సంఘటిత అసంఘటిత కార్మికుల కోసం పోరాటాలు చేసిన ఘనత బిఆర్ భగవాన్ దాస్ కి దక్కుతుందని ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు అన్నారు. భగవాన్ దాస్ ఆశయ సాదన కోసం ప్రతి ఒక్కరూ కషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్కరికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాల మహానాడు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు బిఆర్ లెనిన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, సిపిఐ రాష్ట్ర నాయకులు తక్కలపల్లి శ్రీనివాసరావు, కర్రే బిక్షపతి, సీనియర్ జర్నలిస్ట్ తోట సుధాకర్, శనిగరం వెంకటేష్, బొల్లె పోగుబాబు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాకే వన్నె తెచ్చిన ఎస్వీఆర్ విద్యార్థి

నీట్ ఫలితాలలో ఆల్ ఇండియా 2వ ర్యాంకు
కార్పొరేట్ కళాశాల ఫీజు రాయితీతో పేద విద్యార్థి ఘనత
మంచి డాక్టర్ కావడమే లక్ష్యమని శ్రీరాంనాయక్
అభినందించిన పాఠశాల యాజమాన్యం



నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని ఎల్లాపూర్ శివారు ఎస్వీఆర్ స్కూల్ విద్యార్థి లావుడ్య శ్రీరాంనాయక్ వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్-2024లో ఆల్ ఇండియా 2వ ర్యాంకు సాధించి జిల్లాకే వన్నెతెచ్చారు. కార్పొరేట్ కళాశాలలో ఫీజు రాయితీతో విద్యనభ్యసించిన ఈ పేద విద్యార్థి నీట్ ఫలితాలలో ఆల్ ఇండియా 2వ ర్యాంకు సాధించారు. మంచి డాక్టర్ కావడమే లక్ష్యమని శ్రీరాంనాయక్ చెబుతున్నారు. ఈ సందర్భంగా నీట్ ఫలితాలలోఅత్యంత ప్రతిభకనబర్చి ఆల్ ఇండియా 2వ ర్యాంకు సాధించిన విద్యార్థి శ్రీరాంనాయక్‌కు పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో డైరెక్టర్ గౌరిశెట్టి జగన్‌మోహన్, ప్రిన్సిపాల్ శేషగిరిరావు విద్యార్థికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జగన్‌మోహన్ మాట్లాడుతూ ఒక మారుమూల ములుగు జిల్లా గ్రామం నుంచి మామూలు స్థాయి విద్యతో పాఠశాలలో 7వ తరగతిలో చేరిన శ్రీరాంనాయక్ ఇంతటి ఘన విజయం సాధించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత విద్యావిధానంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ పాఠశాలలో జరిగే బేసిక్ ప్రోగ్రాంను సరైన రీతిలో అభ్యసిస్తూ ప్రతిరోజు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రి, జీవశాస్త్రంలో నిష్ణాతులైన అంకితభావంతో విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తూ వారు పోటీ పరీక్షలను ఎదుర్కొనుటకు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్వీఆర్‌లో నేర్చుకున్న బేసిక్ విద్యను ఆవలంబనం చేసకొని పదవ తరగతి పరీక్షలో మంచి ఫలితాలను పొంది ప్రముఖ కార్పొరేట్ కళాశాల నారాయణ విద్యా సంస్థలలో కే.శ్రీనివాస్ గైడెన్స్, సాయిలక్ష్మీ పర్యవేక్షణలో పూర్తిగా రెండు సంవత్సరాల ఇంటర్‌మీడియట్ విద్యకు రూ.8లక్షల ఫీజును రాయితీని పొంది మంచి క్రమశిక్షణ విద్యార్థిగా నీట్-2024 పరీక్షలో ఆల్ ఇండియా 2వ ర్యాంకును సాధించడం పాఠశాలకు ఎంతో గర్వకారణమన్నారు. మారుమూల గ్రామం నుంచి అతి సామాన్య విద్యతో వచ్చిన శ్రీరాంనాయక్, అతని సోదరుడు అభిరాం నిట్‌లో అడ్మిషన్ పొంది మంచి ప్రతిభను కనబర్చడంలో పాఠశాలలో నేర్పుతున్న బేసిక్స్, ఐఐటీ ఫౌండేషన్ ప్రోగ్రాం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శేషగిరిరావుతో పాటు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సుబేదారి

చదువుల పేరిట నరకం చూపిస్తున్న విద్యా సంస్థలు చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు అవగాహనా సాధన సమితి అధ్యక్షులు కొంగర వరుణ్ కుమార్ హన్మకొండ డి ఈ ఓ కు మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆత్మహత్యలు తగ్గించాలని, మార్కులు ర్యాంకులు ముఖ్యం కావని పిల్లల ప్రాణాలు ముఖ్యం అని మెమోరాండం లో పేర్కొన్నారు. తల్లి తండ్రులు ఆలోచించాలని, విద్యా ర్థులను వేధిస్తున్న కార్పొరేటర్ విద్యాసమస్యలపై చర్యలు తీసు కోవాలని , చదువుల పేరిట నరకం చూపిస్తున్న విద్యా సంస్థలు. ఇప్పటికే 19విద్యార్థులు ఆత్మహత్యలు నారాయణ , శ్రీచైతన్య కార్పొరేట్ విద్య సంస్థలతో పాటు పలు కార్పొరేట్ ప్రవైట్ విద్యాసంస్థలు చదువు పేరట విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణాలో సాంకేతిక లోపం మూలం గా తలెత్తిన సమస్యల వల్ల 19 మంది విద్యా ర్థులు ఆత్మహత్యలకు పలుపడ్డారు. తర్వాత సమస్య పరిస్కారం అవ్వగా అందరు పాస్ అయ్యారు. ఇది చాలా బాధాకరం అని, విద్యార్థులను చదువు పేరిట వేధింపులకు గురి చేయడం దీనితో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రభుత్వం ఉదాసీనంగా వ్యాహరిస్తుందన్నారు.

మానవ సంబంధాలతోనే సమాజ మనుగడ



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

'మానవ సంబంధలతోనే సమాజ మనుగడ' అని కాకతీయ విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృధ్వీరాజు వల్లాల అన్నారు, విభాగ అధిపతి ఆచార్య టి.సవితా జ్యోత్స్న నిర్వహణ లో రసాయన శాస్త్ర విభాగ సెమినార్ హాల్ లో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల 3 వారాల ఇండస్ట్రియల్ ట్రెనింగ్‌లో భాగంగా అధ్యాపకులకు 21 వ శతాబ్దం లో మానవ సంబంధాలు అనే అంశం పై మాట్లాడారు, విద్యార్థి లో మానవ సంబందాలు పెంపొందించటంలో అధ్యాపకుల పాత్ర వివరించారు, టీనేజ్ లో యువత కు మానవ సంబంధాల ప్రాముఖ్యతను తెలపాలన్నారు, ఆక్టివిటీలు, రోల్ ప్లే, సమస్యా పరిష్కార విధానాల ద్వార మానవ సంబంధాల ప్రాముఖ్యత ను వివరించారు, ఉత్తమ సమాజ నిర్మాణంలో, సమాజ మనుగడ, అబివద్ధి లో, వ్యక్తిత్వ వికాసం లో మానవ సంబంధాలు ఎలా ఉపయోగపదుతాయి, క్షీనిస్తున్న మానవ సంబంధాలు ఎలా పదిల పరుచుకోవాలి, పెంపొందించుకోవాలి అనే విషయాల పై పవర్ పాయింట్, ఆడియో, విజ్యువల్ ద్వార ప్రెజెంట్ చేసారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం : ఎంఎస్‌పీ



నవతెలంగాణ-హసన్‌పర్తి

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు, మండల ఇంచార్జి వేల్పుల సూరన్న పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మాదిగ కో కన్వీనర్ రాజారపు భిక్షపతి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం 1994 జులై 7న ప్రకాశం జిల్లా ఈదుమ్ముడు అనే గ్రామంలో 20 మందితో పురుడుబోసుకున్న ఉద్యమం అన్నారు. ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ సాధన కోసం మూడు దశాబ్దాలుగా సుదీర్ఘ పోరాటం చేస్తుందన్నారు. భారతదేశంలోని మాదిగలను, మాదిగ ఉపకులాలను చైతన్యం చేసి త్వరలోనే మాదిగల ఆకాంక్ష అయిన ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం వచ్చే నెల జూలై 7న లక్ష మంది మాదిగ, మాదిగ ఉపకులాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మగౌరవ కవాత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ సాధన కోసమే ఏర్పడ్డ మాదిగ దండోరా ఉద్యమం ఈ దేశంలోని సబ్బండ కులాలకు అండగా నిలిచిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో గుండె జబ్బులతో బాధపడుతున్న నిరుపేదలకు ఆరోగ్యశ్రీ పథకాన్ని, వద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇప్పించి అండగా నిలిచిందన్నారు. మహిళలపై హత్యలు, అత్యాచారాలు చేస్తే వెంటనే శిక్ష పడే విధంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను సాధన కోసం పోరాటం చేసి సాధించింది కూడా దండోరా ఉద్యమేనని గుర్తు చేశారు. సబ్బండ కులాలు అన్యాయానికి గురైతే నేనున్నానని అండగా నిలిచింది కూడా దండోరా ఉద్యమేనని అన్నారు. ఈ కవాతుకు రెండు తెలుగు రాష్ట్రాల మాదిగలే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్ 21 రాష్ట్రాల మాదిగ , మాదిగ ఉపకులాలు, కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు పుట్ట రవి మాదిగ, ఆరెపల్లి పవన్ మాదిగ, మేకల రమేష్ మాదిగ, రేణుకుంట్ల దుర్గాప్రసాద్, బోడ సాంబయ్య, దామెర చిరంజీవి, నందిపాక అరవింద్, మేకల సదానందం, బండారి సాంబయ్య, సిద్దు, ఎల్తురు సురేష్, బీసీ నాయకులు బోనగాని శీనుగౌడ్, రావుల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

చిల్పూర్ మండల పరిధిలోని శ్రీపతిపల్లి గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2008-09 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాటి విద్యార్థులు రంగు రమేష్, తుపాకుల సాంబరాజు, పిట్టల రాజ్ కుమార్, బర్మ రవి, పిట్టల హరీష్, మేకల శేఖర్, చెట్టబోయిన కనకరాజు, మోతె రజినీకాంత్, దిండిగాల కిషన్, మూడిక హరీష్ , పిట్టల పర్షరాములు, సుకన్య, సంగీత, సౌందర్య, లావణ్య సంధ్య, సంధ్యారాణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

బుగులు వెంకన్నను దర్శించుకున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

రెండో తిరుపతిగా విరాజిల్లుతున్న చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర ఆలయం శనివారం వారకళ్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణలతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివునిపల్లి గ్రామం వేముగంటి శ్రీనివాస్ సంగీత దంపతులు అన్నదానం నిర్వహించారు. హైద్రాబాద్, బాలానగర్ ముప్పిడి వెంకట్ రెడ్డి, సుచరిత దంపతులు స్వామివారికి వెండి యజ్ఞోపవీతం బహుకరించారు. ఈకార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి బి. లక్ష్మీ ప్రసన్న, అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



రామోజీరావుకు ఘన నివాళులు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీ రావు పార్థివ దేహానికి శనివారం మాజీ ఉపముఖ్యమంత్రి,స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్షరయోధుడు, పత్రికా రంగానికి నూతన ఒరవడిని సృష్టించిన గొప్ప మహానుభావుడు రామోజీ రావు అని, ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో ఎదిగిన గొప్ప దార్శినికుడని, మీడియా రంగంలో, సినిమా రంగంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని, రామోజీ రావుని కోల్పోవడం తీరని లోటని తెలిపారు.

జర్నలిజానికి వన్నె తెచ్చిన మహోన్నత శిఖరం రామోజీ...

నవతెలంగాణ-జనగామ

తెలుగు రాష్ట్రాలలో జర్నలిజానికి వన్నెతెచ్చిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల జనగామ జిల్లా కవులు కళాకారుల ఐక్యవేదిక దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. కృషి పట్టుదల ఉంటే మనిషి ఏదైనా సాధించవచ్చు అనడానికి ప్రత్యక్ష నిదర్శనం రామోజీరావు అని పలువురు కవులు, కళాకారులు అభిప్రాయపడ్డారు. శనివారం ఆయన మృతికి జనగామ జిల్లా కేంద్రంలో కవులు కళాకారులు నివాళులర్పించారు.

నివాళులర్పించిన వారిలో కవులు, కళాకారులు జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిల సోమనరసింహా చారి, లగి శెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, డాక్టర్ వేముల సదానందం, గడ్డం మనోజ్ కుమార్, చిలుమోజు సాయికిరణ్, అంబల శివనాథ్ గౌడ్, తాళ్ళపల్లి లక్ష్మణ్ గౌడ్ ఉన్నారు.

తీన్మార్ మల్లన్నను కలిసిన మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్నను శనివారం జనగామ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్ రెడ్డి కలిసి పుష్పం అందజేసి అభినందించారు. మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ కార్యకర్తగా, నాయకులుగా కొనసాగుతున్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు భక్కి లింగం తదితరులు ఉన్నారు.



కడియం కావ్యకు 'ఐఎన్టీయూసీ' అభినందన

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

వరంగల్ పార్లమెంటు నియోజక వర్గ ఎంపీగా కడియం కావ్య గెలుపొందగా, శనివారం రాష్ట్ర విద్యుత్తు ఉద్యోగుల సంఘం ఐఎన్టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఈ.శ్రీధర్‌తో పాటుగా, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుకు నీలం ఐలేష్ ఆధ్వర్యంలో విద్యుత్తు ఉద్యోగులు కలిసి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో కంపెనీ అధ్యక్షులు పి.మహేందర్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సదయ్య, ఓదెలు, జనగాం జిల్లా కార్యదర్శి సీహెచ్. నరేందర్ రెడ్డి, ఘనపూర్ డివిజన్ కార్యదర్శి బి.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు చేరుకున్న ఏకరూప దుస్తులు

నవతెలంగాణ-జఫర్‌గడ్



ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండల కేంద్రమైన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కు ఏపీఎం సురేందర్ శనివారం ఏకరూప దుస్తులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది మామిడాల శివ, సీఆర్‌పీ పుట్టస్వామి తదితరులు పాల్గొన్నారు.



మృతురాలి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లింగాలగణపురం

మండలంలోని నేలపోగుల గ్రామంలో ఇటీవలే కేమిడి పెద్ద మల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 100 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సాంస్కృతిక సేన రాష్ట్రకార్యదర్శి,నేలపోగుల ఎంపీటీసీ డాక్టర్ గుగ్గిల్ల నర్సయ్య, గ్రామాధ్యక్షులు గైని ప్రవీణ్, సీనియర్ నాయకులు గుగిల్ల కొంరయ్య, ఆకుల సత్తయ్య, గోగు కొంరయ్య, కే.భాస్కర్, మైల అబ్బయ్య, గుగిల్ల ప్రభాకర్, ఆవుల హరీష్, యుత్ అధ్యక్షులు మైల రాజు, ఉపాధ్యక్షులు పన్నీరు అరుణ్, ఆకుల యాకన్న, భసిపాక రాజు, గుగ్గిల్ల నాగరాజు, గుగ్గిళ్ళ సాగర్, గుగ్గిల్ల ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రమేష్ రాజాను పరామర్శించిన గంట రవీందర్

నవతెలంగాణ-పాలకుర్తి



సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా తండ్రి మామిండ్ల ఎల్లయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందడంతో శనివారం మహాత్మా హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు గంట రవీందర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మహాత్మ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పోతుగంటి నర్సయ్య, చిదురాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్
- అరగంట ముందే గేట్లు మూసివేత

నవతెలంగాణ-జనగామ





జిల్లాలో నేడు జరిగే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, మెడికల్ కిట్, తదితరాల విషయాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. తరగతి గదులను తనిఖీ చేసి, బెంచీలపై అతికించిన హాల్ టికెట్‌ల నంబర్‌లను అత్యంత జాగ్రత్తగా, సరైన విధంగా ఉండేలా సరిచూసుకోవాలని ఆదేశించారు. అలాగే బ్లాక్ బోర్డుపై అభ్యర్థుల సీటింగ్ వివరాలు, పరీక్ష కేంద్రాల ముందు సూచిక వివరాల వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈ ప్రిలిమ్స్ పరీక్ష జరగనుందని కలెక్టర్ తెలిపారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే (10 గంటలకు) పరీక్ష కేంద్రాల గేట్లు గేట్లు మూసి వేయనున్నట్లు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించి వెళ్లాలన్నారు. పరీక్షార్థులు మెహిందీ, తాత్కాలిక టాటూలను వేసుకోరాదని స్పష్టం చేశారు. మొత్తం 3,697 మంది అభ్యర్థులు 14 పరీక్ష కేంద్రాల్లో ఈ గ్రూప్-1 పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని, పరీక్ష సమయానికి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఆర్టీసీ బస్సులు సరిపడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, ఉదయం 9 గంటల నుంచే పరీక్ష హాల్లోకి అనుమతిస్తామని, 9.30 గంటలకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రారంభమవుతుందని చెప్పారు. పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్‌ను, బ్లూ (లేదా) బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో పాటు గుర్తింపు పొందిన ప్రభుత్వ ఒరిజినల్ ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష సమయ పాలనకు సూచికగా ప్రతీ అర్ధగంటకోసారి బెల్ మోగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో కాంగ్రెస్ సంబరాలు

నవతెలంగాణ-పాలకుర్తి



వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న విజయం సాధించడంతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిల ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలో గల రాజీవ్ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ, కుమారస్వామి గౌడ్ మాట్లాడుతూ పట్టభద్రులందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని తెలిపారు. ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రుల అండదండలు మరువలేనివని తెలిపారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం, ఉపాధి అవకాశాలు కల్పించడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. ఆరు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన వరుస విజయాలకు నిదర్శనంగా నిలిచాయని తెలిపారు. తీన్మార్ మల్లన్నకు అండగా నిలిచి గెలిపించిన పట్టభద్రులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గోనె మహేందర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జలగం కుమార్, పాలకుర్తి పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగన్న గౌడ్, పెనుగొండ రమేష్, మాడరాజు యాకయ్య, బండి అయోధ్య, బండపల్లి వెంకన్న, గొట్టిముక్కల సుధాకర్ రెడ్డి, గుడ్ల వెంకన్న, వీరమనేని శ్రీనివాసరావు, నారగోని ఎల్లయ్య, కామారపు సునీల్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా నిషేధం అమలు జరిగేనా..?

- విచ్చలవిడిగా గుట్కా పాన్ మసాలాల అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-తొర్రూరు



గుట్కా, పొగాకు తయారీ పదార్థాలను అరికట్టడానికి ప్రభుత్వం గతంలో అధికారిక ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో విక్రయాలు బహిరంగంగానే సాగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యువతపై ప్రభావం చూపుతున్న డ్రగ్స్, గంజాయి పై ఓవైపు ఉక్కుపాదం మోపుతూనే.. మరోవైపు గుట్కా, పాన్ మసాలాలపై నిషేధం విధిస్తూ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ద్వారా ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పొగాకు నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలాల పై నిషేధం కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వీటి తయారీ, నిల్వలు, పంపిణీ రవాణా, అమ్మకాలపై పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తూ ఉన్నట్లు పేర్కొన్నారు. మే 24 నుంచి ఏడాది కాలం పాటు ఈ నిబంధనలో అమలులో ఉంటాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. తాజా ఉత్తర్వుల్లో ఆహార భద్రత ప్రమాణాల చట్టం 2006 ప్రకారం ఈ నిషేధం అమల్లోకి వస్తుందని తెలిపింది.

క్షేత్రస్థాయిలో అమలు కానీ ఆదేశాలు...

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిషేధాన్ని అమలు చేయాలని చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడ అమలు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యానికి హానికరమైన గుట్కా విక్రయాలను వెంటనే నిర్మూలించాలని ఇదే అదనుగా బడా వ్యాపారులు సరు కును నల్లబజారులో అధిక ధరలకు విక్రయించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికే చిరువ్యాపారులకు విక్రయించే గుట్కా ప్యాకెట్లు సామాగ్రిని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని సమాచారం. ఇదే అదనుగా హోల్ సేల్ వ్యాపారులతో పాటు పలువురు అక్రమంగా దందా చేసేవారు గుట్కాలను వేర్వేరు చోట్ల గోదాములలో రహస్యంగా నిల్వ చేసినట్లు తెలుస్తుంది. దీంతో ప్రమాదకర క్యాన్సర్ తదితర వ్యాధుల నుంచి గుట్కా ప్రియులను దూరం చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు ఆదిలోనే హంసపాదుగా మారిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఏది ఏమైనాప్పటికీ ఆరోగ్యానికి హాని కలిగించే గుట్కాలను పూర్తిస్థాయిలో నిషేధించి వాటి నుండి యువతను కాపాడాలని కోరుతున్నారు.



కుక్కల దాడిలో ఆరేండ్ల బాలుడు మృతి..?

- చిల్పూర్ మండలం ఫతేపూర్‌లో ఘటన

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడు గుగులోత్ అభిరామ్ (6) మృతి చెందిన ఘటన చిల్పూర్ మండలం ఫతేపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన గుగులోత్ మధు సరితకి ఇద్దరు కుమారులు, చిన్నకుమారుడైన అభిరామ్ ఉదయాన్నే పొలం పనులకని తల్లిదండ్రులు వెళ్తుంటే వెంబడిపడి తాను వస్తానంటూ కొద్ది దూరం వరకు ఏడ్చుకుంటూ వెళ్ళగా, తిరిగి తండ్రి మధు ఇంటివద్ద వదిలి నచ్చజెప్పి వెళ్లాడు. తిరిగి వ్యవసాయ పనులు ముగించుకుని సాయంకాలం ఐదు గంటలకు ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు బాలుడు కనిపించకపోవడంతో, బాలుడి కోసం గాలించగా ఆచూకీ ఎక్కడా కనిపించలేదు.చివరకు పొలం దగ్గరకి వెళ్ళే దారిలో గమనించగా అదేదారిలో ఊరి సమీపంలోని వాగు వద్ద బాలుడి బాలుడి మృతదేహం లభ్యమైంది. కుక్కల దాడిలోనే బాలుడు చనిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో కూడా గ్రామంలో కుక్కల దాడిలో పలువురు గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారి నుండి కాపాడాలని వేడుకుంటున్నారు.



పెండింగ్ బకాయిలను... విడుదల చేయాలి

- టీచర్స్ బదిలీలు, ప్రమోషన్లను పారదర్శకంగా నిర్వహించాలి
- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కొరవి సుధాకరాచారి

నవతెలంగాణ-తొర్రూరు

ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్టియూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొరవి సుధాకరా చారి డిమాండ్ చేశారు. శనివారం తొర్రూరు పట్టణంలోని స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఎస్టియూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల మెడికల్ రియంబర్స్మెంట్, పిఆర్సి ఏరియల్స్, సరెండర్ బిల్స్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయల బదిలీలు, ప్రమోషన్లను షెడ్యూల్ ప్రకారంగా పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. పిఆర్‌సి కమిటీ నివేదికను త్వరగా పూర్తిచేసి వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌జి టి, స్కూల్ అసిస్టెంట్ల మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కేజీబీవీ, ఎస్ఎస్ఏలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి మినిమం టైంస్కేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో వెంటనే స్కావెంజర్లను నియమించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టియు అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎస్టియు ప్రధాన కార్యదర్శి జి.యాకుబ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, డి. చంద్రమౌళి, గుంటుక యాకయ్య శ్రీనివాస్, రమేష్, హరికృష్ణ చారి పాల్గొన్నారు.



బైక్‌ల మీద వచ్చి.. చేపల చెరువు లూటీ..

- మృగశిర కార్తె వచ్చింది.. చేపలకి డిమాండ్ పెరిగింది..

నవతెలంగాణ-ఇనుగుర్తి

వేసవి ఎండలకు ఉసూరుమన్న ప్రాణం తొలకరి జల్లులతో ఉపశమనం పొందుతుంది. వాతావరణంలో వచ్చిన ఈ తేడాను తట్టుకునేందుకు చేపలు తినాలంటారు. మృగశిర కార్తె వచ్చిందనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది చేపలే. అందుకు ఎక్కడ చూసినా మార్కెట్లు రష్‌గా కనిపిస్తాయి. అయితే మండల కేంద్రంలోని గ్రామస్థులు చేపల వేటకు వెళ్లారు. స్థానికంగా ఉన్న బెరడు వాణి(భేటీ) చెరువులో లూటీ చేశారు. ఇనుగుర్తి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఒక్కసారిగా చెరువుపై పడ్డారు. చేపల కోసం ఏకంగా దండ యాత్ర చేశారు. దొరికినవారికి దొరికినంత మహాదేవా అన్నట్లు దొరికినకాడికి చేపలను పట్టుకెళ్లారు. మృగశిరకార్తె నాడు చేపలు తినాలనే ఉద్దేశంతో జనమంతా ఇలా చేపల వేట కొనసాగించారు. బెరడువాణి(భేటీ) చెరువులో నీరు అడుగంటింది. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వలలతో చెరువులోకి దిగారు.మగవారితో పాటు మహిళలు కూడా పోటీ పడి వలలు చీరలు చేతబట్టి చేపలను పట్టుకెళ్లారు. పెద్ద ఎత్తున జనం చేపల వేటకు రావడంతో ఎటుచూసినా జనసందోహమే కనిపించింది.



చాపల మార్కెట్లో సందడి

నవతెలంగాణ-మరిపెడ

మృగశిర కార్తె రోజు చాపలు తినాలని చాపలు దొరకని వారు కనీసం చాపల వాసనైనా చూడాలని ప్రతి ఒక్కరు ఆరాటపడుతున్నారు. శనివారం మృగశిర కార్తె సందర్భంగా మరిపెడ చాపల మార్కెట్లో చాపలు దొరకక పలువురు మాసం ప్రియులు ఇబ్బందులు పడ్డారు. వైరా,పర్వతగిరి ప్రాంతాల నుండి మత్స్యకారులు చాపలు తీసుకురావడంతో మార్కెట్‌లో వచ్చిన వినియోగదారులు చాపలకోసం ఒక్కసారిగా ఎగబడ్డారు. కేజీ చాప రూ.200 నుండి 300 వరకు డిమాండ్ పలికింది.

సమాజ తిరోగమన శక్తులను తిప్పి కొట్టాలంటే...

శాస్త్రీయ ఆలోచన అవసరం

- రాజకీయ విద్యా విధానం బాధ్యులు మిరియం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మహబూబాబాద్

సమాజ తిరోగమన శక్తులను తిప్పికొట్టాలంటే శాస్త్రీ ఆలోచన అవసరం అని రాజకీయ విద్యా విధానం బాధ్యులు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు రెండవ రోజు శనివారం శాస్త్రీయ ఆలోచన అనే అంశంపై మిరియం వెంకటేశ్వర్లు క్లాస్ బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ పురోభివద్ధికి తోడ్పడేది కేవలం శాస్త్రీయ ఆలోచనని ఈ శాస్త్రీయ ఆలోచనలను మళ్ళించడం కోసం అనేక మూఢత్వ శక్తులు ఈ సమాజం మీద ప్రభావం చూపిస్తున్నాయని అన్నారు. ఈ తిరోగమన శక్తులను తిప్పి కొట్టాలంటే శాస్త్రీయ ఆలోచన ఒక్కటే మార్గమని ఆయన హితవు పలికారు. అనేక జాతుల సమ్మేళతంగా వందల భాషలు, వేల కులాలు, అనేక మతాలు విలసిల్లుతున్న భారతదేశాన్ని ఒక జాతి మాత్రమే ఉండాలని, ఒకే జాతి ఒకే మతం ఒకే భాష అనేటటువంటి మూఢత్వ ఆలోచనలను ప్రజల మీద రుద్దే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దీనిని ప్రజలు తిప్పి కొడతారని ఆయన అన్నారు. ప్రజా కళాకారులు శాస్త్రీయ ఆలోచనతో ఈ సమాజాన్ని అర్థం చేసుకొని ఈ సమాజ చైతన్యానికి మీ వంతు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ శిక్షణ తరగతులలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వేముల ఆనంద్, కట్ట నరసింహ ఉపాధ్యక్షులు నాగభూషణం, సహాయ కార్యదర్శి వినోద్ కుమార్, సదానంద్, ముత్యాలు, జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సైదులు, రామకష్ణ, జిల్లా నాయకులు కొమ్ము శ్రీను, ఉప్పలయ్య, మర్స వెంకన్న హరిత, ఎల్లమ్మ, నూనె శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

- జూనియర్ సివిల్ జడ్జి మట్టా సరిత



నవతెలంగాణ-తొర్రూరు

వివిధ రకాల కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదపడుతుందని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి మట్టా సరిత అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్లో 1227 పెట్టి కేసులు పరిష్కరించినట్లు ఈ కేసుల ద్వారా రెండు లక్షల 55 వేల 110 రూపాయలు, 17 కేసులు రాజీ పడ్డారని, మరో 15 కేసులలో 1,15,400 రూపాయలు జరిమానా విధించబడిందన్నారు. రెండు ఫ్యామిలీ కేసులు, ఒకటి సివిల్ కేస్, 57 ఎక్సైజ్ కేసుల ద్వారా రెండు లక్షల 85 వేల రూపాయలు వసూల్ అయినాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ గణేష్ ఆనంద్, న్యాయవాదులు వి.మహేష్, బి.వెంకటేష్, సైదులు, తొర్రూరు సిఐ సంజీవ, తొర్రూరు ఎస్సై జగదీష్, నర్సింలపేట ఎస్ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి

- టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి



నవతెలంగాణ-మహబూబాబాద్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి పి.రామారావుకు యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ యాకూబ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రారంభమైన అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయుల పదోన్నతులలో వెరిఫికేషన్స్, సీనియారిటీ లిస్టు తయారీలో, ఖాళీ ఎస్జీటీ క్యాడర్ బదిలీలలో సీనియారిటీ లిస్టు, ఖాళీల ప్రదర్శనలో ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా చేయాలని కోరారు.



ప్రతీ విత్తన దుకాణం తనిఖీ చేయాలి

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

నవతెలంగాణ-మహబూబాబాద్

వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని ప్రతీ విత్తన దుకాణం తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్ హాలులో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని నిబంధనల మేరకు జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయి ఏఈఓలు రైతులకు వానాకాలం పంటల పైన అవగాహన కల్పించాలని, జిల్లాలోని ప్రతీ విత్తన దుకాణాలను క్షుణంగా తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వానకాలానికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన పడవద్దు అని, ఏదైనా సమస్య ఉన్నట్లయితే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించుకోవాలిన సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ టీంలు (వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ అధికారులు) విత్తనాల దుకాణాలను తరచుగా తనిఖీలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ఉన్న డీలర్లు వారి నియమ నిబంధనలు పాటించు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని, నిబంధనలు పాటించని విత్తన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలపై నిఘాపెట్టి,ఎవరైన నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే వారిపై విత్తన చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి తీరని లోటు

- టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా సహాయ కార్యదర్శి జిన్నా లచ్చయ్య



నవతెలంగాణ-మరిపెడ

ఈనాడు గ్రూప్ సంస్థ చైర్మన్ రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని ఆయన చేసిన సేవలు మర్చిపోలేనివని టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి జిన్నా లచ్చయ్య అన్నారు. శనివారం మరిపెడ మండల కేంద్రంలోని రామోజీ రావు మృతి పట్ల ప్రగడ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు. రామోజీ రావు పత్రిక రంగంలో నూతన వరవడిని సృష్టించారని అన్నారు. ఆయన పత్రిక రంగమే కాకుండా సినీ ఇండస్ట్రీ, మార్గదర్శి చిట్‌ఫండ్ అధినేతగా అనేక మందికి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ వారందరికీ జీవన ఆధారంగా నిలిచిన ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. జీవించి ఉండగానే సొంతంగా స్మారకం నిర్మించుకున్న ఏకైక వ్యక్తి రామోజీ రావు అన్నారు. 'మరణం ఒక వరం', 'నాకు చావు భయం లేదు' చాటి చెప్పి చూపించారని, రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ..స్మారకన్ని నిర్మించుకోవడం మహా అద్భుతం అన్నారు. రాబోయే తరాలకు ఒక మార్గదర్శిగా రామోజీరావు నిలిచారని పేర్కొన్నారు.



హరిపిరాల గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ వితరణ

- మాజీ సర్పంచ్ మమతారెడ్డి ఔదార్యం

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

తొర్రూర్ మండలం హరిపిరాల గ్రామపంచాయతీకి మాజీ సర్పంచ్ రావుల మమతారెడ్డి శనివారం ఫ్రీజర్ బాక్సును గ్రామపంచాయతీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి దేవయ్యకు అందజేసి మాట్లాడారు. మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో గ్రామంలో ఫ్రీజర్ బాక్స్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా రూ.70 వేల విలువచేసే ఫ్రీజర్ బాక్స్ అందజేసినట్లు తెలిపారు. ప్రజలకు సంక్షేమ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తన పదవి ఉన్నా లేకపోయినా గ్రామాభివృద్ధి కోసం సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు సుంచు సంతోష్, మాజీ మండలాధ్యక్షులు చెవిటి సుధాకర్, ఎంపీటీసీ వల్లపు గోపమ్మ మల్లయ్య, నారాయణ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి గృహ జ్యోతి

- మండలాధ్యక్షులు మారబోయిన వెంకటేశ్వర్లు ముదిరాజ్

నవతెలంగాణ-చిన్నగూడూరు

అర్హులైన ప్రతి ఒక్కరికి గృహ జ్యోతి పథకం అందుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షులు మారబోయిన వెంకటేశ్వర్లు ముదిరాజ్ అన్నారు. ఆదివారం స్థానిక మండల కేంద్రంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ 6 నుండి ఎన్నికల కోడ్ ముగియడంతో కాంగ్రెస్ అమలు చేస్తున్న గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్ ఆధ్వర్యంలో నేటి నుండి లబ్ధి చెందుతుందని తెలిపారు. అంతేకాకుండా 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం జారీ చేస్తుందని, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి



నవతెలంగాణ-ఇనుగుర్తి

స్థానిక మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కొడకండ్ల రామ్ రెడ్డి(90) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. గతంలో గ్రామ అధ్యక్షుడిగా చేసినప్పటి సేవలను మరువలేమని తెలిపారు. ఈ సందర్భంగా రామ్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మరిపెడ : మండల కేంద్రంలోని మండల కేంద్రంలోని శ్రీరాఘవ విద్యాన్ కేతన పాఠశాల లో 2000-01 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు శనివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత ఒకరొనొకరు కలుసుకోవటంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి అప్పటి వారి గురువులను ఘనంగా సన్మానించారు. విద్యార్థి దశలో ఉన్న వారు నేడు మంచి స్థానాల్లో ఉండటంతో గురువులు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు అబ్బయ్య, రాజేందర్, నరేందర్, వెంకోబా, సురేందర్, శ్రీను, అజ్గర్, కృష్ణ, ఉపాధ్యాయిని అరుణ ఈ కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులు కె.వెంకన్న, షైక్ రఫీ, ప్రభాకర్, లాల్ చంద్, అజ్జిత్, భీమా తదితరులు పాల్గొన్నారు.



బడి బస్సులు భద్రమేనా..!?

- నిబంధనలు హుష్ కాకి.. 12 నుండి పాఠశాలలు ప్రారంభం...
- 'ప్రైవేటు' వాహనాల సంగతేంటి.. పత్తాలేని ఆర్టీఏ తనిఖీలు...



నవతెలంగాణ-మహబూబాబాద్

బడి బస్సులు భద్రమేనా.. ప్రైవేటు పాఠశాలల వాహనాల సంగతేంటి.. 12 నుండి పాఠశాల ప్రారంభం.. కళ్ళు తెరవని ఆర్టీఏ అధికారులు.. పాఠాలు అటకెక్కించారు .. బ్యాగుల బరువు పెంచారు.. ప్రైవేటు పాఠశాలల రవాణా వ్యాపారం.. చిన్నారుల రవాణాలో రాజకీయమేల.. మహబూబాబాద్ జిల్లాలో ప్రైవేటు పాఠశాలలో బడి బస్సులలో చిన్నారుల రవాణాలో నిర్లక్ష్యం నిలువుటద్దంగా నిలుస్తుంది. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తే ఆ రాజకీయ పార్టీ సమావేశాలకు బస్సులు సమకూరుస్తున్న ప్రైవేట్ పాఠశాలలు బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యాంగ వ్యవహరించడంతో చిన్నారుల ప్రాణాల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. తల్లిదండ్రుల ప్రైవేటు మోజు ఇంగ్లీష్ మాటలపై ఉన్న తీపి చిన్నారులను తప్పనిసరి పరిస్థితుల్లో బస్సులను ఎక్కిస్తుంది. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను పట్టణాల్లోని హైటెక్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదివించడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో బస్సులను ఆశ్రయిస్తున్నారు. మధ్య తరగతి తల్లిదండ్రుల ఆశ మోజును ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు కాసులు కురిపిస్తున్నాయి. విద్యార్థులను దగ్గరుండి మరీ బస్సు ఎక్కిస్తున్న తల్లిదండ్రులు ఆ బస్సులో నాణ్యత పరిస్థితి ఏంటి..? డ్రైవర్, క్లీనర్ లైసెన్సులు.. బస్సులకు ఉన్న నిబంధనలు... ప్రభుత్వ అనుమతి పత్రాలు.... కండిషన్ ఎలా ఉంది ..? అనేది ఏ ఒక్కరూ ఆలోచించడం లేదు. తల్లిదండ్రులు హడావుడిగా వచ్చి బస్సులో ఎక్కిచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆ బస్సులలో కనీస సౌకర్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా..? లేదా..? అని పట్టించుకోవడం లేదు. ఒక రకంగా చెప్పాలంటే తల్లిదండ్రుల నిర్లక్ష్యం పాఠశాల యాజమాన్యాలకు అలుసుగా మారిందని చెప్పక తప్పదు. పాఠశాల విద్యార్థుల రవాణాకు వినియోగించే బస్సులకు ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు విధించింది కానీ అందులో సగానికి పైగా నిబంధనలను ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు.

అనుమతి పత్రాలు తనిఖీ ఇలా...

పాఠశాల బస్సుకు సంబంధించిన డ్రైవర్లు బ్యాడ్జి హెవీ లైసెన్స్ కలిగి 15 సంవత్సరాల అనుభవంతో పాటు 50 సంవత్సరాలు లోపు వారే ఉండాలి. వారికి కలర్ బ్లైండ్నెస్ లేదని ఐ డాక్టర్ సర్టిఫికెట్ ఉండాలి. బస్సుకు తప్పనిసరిగా క్లీనర్ ఉండాలి. బస్సు 10 సంవత్సరాలలోపు మోడల్ అయి ఉండాలి. బస్సులు పసుపు రంగులో ఉండాలి. వాటిపై బస్సుల పేర్లు పాఠశాల యాజమాన్యం ఫోన్ నెంబర్లు ఉండాలి. అత్యవసరం అగ్ని ప్రమాదం ఆసుపత్రి ఎమర్జెన్సీ ఫైర్ స్టేషన్ నెంబర్లు ఉండాలి. కండిషన్‌లో ఉన్నట్లు ఆర్టీవో రిజిస్ట్రేషన్ ఫిట్నెస్ పర్మిట్ రోడ్ టాక్స్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లతో పాటు వాహన బీమాతో పాటు అందులో ప్రయాణించే విద్యార్థులకు భీమాసర్టిఫికెట్లు ఉండాలి.సర్టిఫికెట్లు ఎప్పుడు బస్సు వెంటనే ఉండాలి. బస్సు అత్యధిక వేగంతో పోకుండా లాకింగ్ ఉండాలి.నిబంధనలు అన్నీ ఖచ్చితంగా పాటించే బస్సులకే ప్రతి సంవత్సరానికి ఒకసారి ఆర్టీవో అధికారులు తనిఖీ చేసి ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇవ్వవలసి ఉంటుంది. కానీ కొన్ని ప్రాంతాల్లో ఆర్టీఏ అధికారులు ఒక్కొక్క బస్సుకు పదివేల నుంచి ఇరవై వేల రూపాయలు దండుకొని నిబంధనలు అమలు చేయకుండా ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఈ విద్యా సంవత్సరంలో అలాంటి అవినీతి అక్రమాలు జరగకుండా ఆర్టీఏ శాఖపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధన పాటించని బస్సులు రిజెక్ట్ : గౌస్ పాషా డీటీఓ

జిల్లాలో ప్రైవేటు పాఠశాలలో నిబంధనలు పాటించని బస్సులకు ఫిట్నెస్‌లు చేయడం లేదు. ఇప్పటివరకు ఐదు బస్సులను రిజెక్ట్ చేశాము. పూర్తిస్థాయి కండిషన్‌లో ఉన్న బస్సులకే ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇస్తాము. జిల్లాలో 100కు పైగా ప్రైవేట్ పాఠశాల బస్సులు ఉన్నాయి. పాఠశాల ప్రారంభం కాగానే నిరంతర తనిఖీలు నిర్వహిస్తాము. నిబంధనలు పాటించకుంటే బస్సులను సీజ్ చేస్తాము.

కార్మిక చట్టాలు అమలు కావడం లేదు : డ్రైవర్ లింగన్న

పాఠశాల బస్సు డ్రైవర్లకు కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. డ్రైవర్లకు యూనియన్ లేకపోవడంతో కార్మిక శాఖ లేబర్ కార్డులు ఇవ్వడం లేదు. జిల్లాలో ఏ ఒక్క డ్రైవర్‌కు లేబర్ కార్డు లేదు. పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా వర్తించడం లేదు. కార్మిక శాఖ సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. యాజమాన్యాలు సెలవు రోజుల్లో కూడా పని చేయిస్తున్నారు. స్కూల్ బస్సు లే కాక వారి సొంత వాహనాలు కూడా డ్రైవింగ్ చేయమని వత్తిడి చేస్తున్నారు. కాకి యూనిఫామ్‌లు ఇవ్వడం లేదు. వేతనాల పెంపు, బోనస్, అదనపు సెలవులు అమలు కావడం లేదు. వేసవి సెలవుల్లో డ్రైవర్లకు వేతనాలు ఇవ్వడం లేదు. ప్రతి నెల సకాలంలో వేతనాలు అందే పరిస్థితి లేదు.

గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు...

కట్టుదిట్టమైన భద్రత

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్



నవతెలంగాణ-మహబూబాబాద్

నేడు జరిగే టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో గ్రూప్-1పై జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్, గ్రూప్-1 రీజినల్ కో కోఆర్డినేటర్ శ్రీనివాస్ రావు, చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష ఏర్పాట్లలో కట్టుదిట్టమైన భారీ బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని, పరీక్ష సెంటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లాలో 12 సెంటర్లు ఉన్నాయని, ఒక్కొక్క సెంటర్‌కి పరీక్షా కేంద్రాల విస్తీర్ణాన్ని బట్టి 4412 మంది అభ్యర్థులను సిటింగ్ అరేంజ్మెంట్ చేయడం జరిగిందన్నారు. మహబూబాబాద్‌లో 7, తొర్రూర్‌లో 5 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కొక్క సెంటర్‌కి చీఫ్ సూపరింటెండెంట్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహబూబాబాద్‌లో మహర్షి విద్యాలయం, ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, ఏకశిలా ఏంజెల్ స్కూల్, ఎస్వి విద్యాలయ హై స్కూల్, శ్రీ చైతన్య ఇ టెక్నో స్కూల్, ఫాతిమా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, టీఎస్ డబ్ల్యూ ఆర్‌జెసి గర్ల్స్, అలాగే తొర్రూర్‌లోని సెయింట్ పాల్స్ హై స్కూల్, టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కాలేజ్ గర్ల్స్, ఆర్యభట్ట హై స్కూల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, సమత డిగ్రీ కాలేజ్‌లలో ప్రిలిమ్స్ సెంటర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే వారి వారి సెంటర్లకు ఉదయం 9.00 గంటలకే వెళ్లాలని, పరీక్ష ప్రారంభం ఉదయం 10.30 నుండి 1.00 వరకు ఉంటుందని అన్నారు. సందేహాలు ఉన్నట్లు అయితే టీపీఎస్సీ టోల్ ఫ్రీ నెంబర్ 7995074803కి కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ ఏర్పాట్లలో కొత్త నిబంధనల మేరకు ఓఎంఆర్ షీట్ పైన అభ్యర్థి పేరు ఉంటుందని, ఓఎంఆర్ షీట్ ఇవ్వగానే ముందుగా వారి పేరు ఉందో లేదో సరి చూసుకుని పరీక్షను ప్రారంభించవలసిందిగా జిల్లా కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు.

పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : ఆర్డీవో నరసింహారావు

తొర్రూరు : టీజీ పీఎస్సీ గ్రూప్ వన్ని ప్రీ లిమ్స్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో నరసింహారావు తెలిపారు. కేంద్రంలో ఐదు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆర్యభట్ట హైస్కూల్లో 480 మంది అభ్యర్థులు, టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ గర్ల్స్ జూనియర్ కళాశాలలో 360 మంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 312 మంది, సమత డిగ్రీ కళాశాలలో 528 మంది, సెంట్ పాల్స్ హై స్కూల్‌లో 360 మంది అభ్యర్థులు పరీక్షను రాయనున్నారని, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశమని తెలిపారు. ఒక్కొక సెంటరు విస్తీర్ణాన్ని బట్టి అభ్యర్థులను సిట్టింగ్ అరేంజ్మెంట్స్ చేయడం జరిగిందన్నారు. హాల్ టికెట్ వెనకాల ఉన్న నిబంధనలను ప్రతి ఒక్క అభ్యర్థి క్షుణ్ణంగా చదివి వాటిని అనుసరించి పరీక్ష రాయాల్సిందిగా ఆర్డీవో నరసింహారావు కోరారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సమయానికి ముందుగానే వారి వారి సెంటర్లకు ఉదయం 9 గంటలకే వెళ్లాలని, పరీక్ష ప్రారంభం ఉదయం 10:30 నుంచి 1:00 వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు సమయపాలన పాటిస్తూ టీజీపీఎస్సీ విధి విధానాలను అనుసరిస్తూ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించుటకు అవసరమైన అన్ని చర్యలు ఏర్పాటు చేశామన్నారు.



హమాలీ చార్జీలు పెంచాలి : కందునూరి శ్రీనివాస్

నవతెలంగాణ-గార్ల

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా హమాలీ కార్మికులకు ఎగుమతి, దిగుమతి చార్జీలు వెంటనే పెంచి తక్షణమే అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా సివిల్ సప్లై హమాలీ కార్మికులకు వేతనాలు పెంచాలనీ, వారి సమస్యలను పరిష్కరించాలని సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం (సీఐటీయూ) అధ్వర్యంలో శనివారం స్థానిక సివిల్ సప్లై గోడను ముందు ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ దుకాణాలు, ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్ వాడి కేంద్రాలకు, మధ్యాహ్న భోజన పథకం క్రింద ప్రభుత్వ పాఠశాలలకు నిరంతరం నిత్యావసర వస్తువులు ఎగుమతి-దిగుమతి చేయడంలో హమాలీ కార్మికుల శ్రమ ఎంతో ఉందని చెప్పారు.గత రెండు సంవత్సరాల క్రితం జీవో నెంబరు 27 ప్రకారం యూనియన్ నాయకులతో చర్చలు జరిపిన ప్రభుత్వం హమాలీ కార్మికులకు పెంచిన వేతనాల ఒప్పందం గత డిసెంబరుతో ముగిసిందన్నారు. నూతన ప్రభుత్వం సంఘం నాయకులతో కలిసి చర్చలు జరిపి ప్రస్తుతం ఉన్న ఎగుమతి-దిగుమతి ఛార్జీ రూ.26 నుండి రూ.35కు పెంచుతూ ఒప్పందం చేసి అమలు చేయాలని డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐ బుద్యాకు అందించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబటి వీరాస్వామి, హమాలీ కార్మికులు సర్వయ్య, వి.ముత్తయ్య, ఎ.రమేష్, వి.సునీల్, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయి వైద్యులను నియమించాలి

గార్ల : స్థానిక సిహెచ్‌సి ప్రభుత్వం హాస్పిటల్లో పూర్తి స్థాయి వైద్యులను నియమించి ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని అందించాలని ఎంపిటీసి గుండెబోయిన నాగమణి కోరారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌ను శనివారం బీజేపీ అధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ హాస్పిటల్‌లో వైద్యులు, సిబ్బంది లేకపోవడం వలన ప్రజలు వైద్యం అందక ప్రైవేటు హాస్పిటల్‌లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వెలిబుచ్చారు. తక్షణమే జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా వైద్య అధికారులు స్పందించి వైద్యులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంపాల శ్రీను, రాము, జి.దేవా, సుమలత, హరి, వీరాస్వామి పాల్గొన్నారు.

చిగురిస్తున్న నామినేటెడ్ ఆశలు..!

- హస్తం నేతల్లో హడావిడి
- ముగిసిన ఎన్నికల కోడ్
- మార్కెట్ కమిటీల పై మోజు
- అధినేతల చుట్టూ ప్రదక్షిణలు

నవతెలంగాణ-మహబూబాబాద్

దశాబ్ద కాలంగా కాంగ్రెస్ జెండాలు మోసి అలసిపోయిన ఖద్దరునేతలు కార్యకర్తలు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవుల పై ఆశలు పెంచుకున్నారు. బీఆర్ఎస్ పాలనలో పోరాటాలు చేసి అలిసి పోయి బీఆర్ఎస్ ప్రభుత్వ వేధింపులకు తట్టుకొని నిలబడిన కార్యకర్తలు ఆర్థికంగా సామాజికంగా చిక్కి చితికి పోయారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏదో ఒక నామినేటెడ్ పదవి వస్తే తప్ప జీవన మనుగడ కష్టతరంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల రావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవులు పంపిణీ చేయడానికి ఎన్నికల కోడ్ అడ్డంగా మారింది. ఎంపీ ఎన్నికల్లో దశాబ్ద కాలం తర్వాత మానుకోట పార్లమెంటు ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈ క్రమంలో గెలిచిన ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్య మురళినాయక్, డాక్టర్ తేజావత్ రాంచంద్రు నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీ పోరిక బలరాం డిసిసి అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి నాయకులు అనుచరులు వారి గెలుపు కోసం పనిచేసిన వారు నామినేటెడ్ పదవుల పై ఆశలు పెంచుకుంటున్నారు. ముఖ్య నాయకులు మంత్రి, ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్పోరేషన్ పదవులపై ఆశలు పెంచుకుంటుండగా చోటా మోటా లీడర్లు మార్కెట్ కమిటీలు డైరెక్టర్లు దేవాలయ కమిటీ సభ్యుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.ఎన్నికలు ముగియగానే నాయకులకు చుట్టూ ప్రదక్షిణ ప్రారంభించారు.జిల్లాలో గ్రంథాలయ కమిటీ చైర్మన్‌సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ సభ్యులు ఇతర రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ కమిటీ సభ్యులు నామినేషన్లు చేయాల్సి ఉంది. జిల్లాలో మహబూబబాద్, కేసముద్రం, తొర్రూరు మార్కెట్ కమిటీలు ఉన్నాయి.జిల్లా గ్రంథాలయ చైర్మన్ కమిటీ సభ్యులు దేవాలయ చైర్మన్‌లో కమిటీ సభ్యులను నియమించవలసి ఉంది.రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఎంపీ ఎన్నికలు పూర్తి కాగానే జిల్లాకు చెందిన ప్రధాన నేతలు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. నామినేటెడ్ పదాలపై ఆచితూచి అడుగేస్తూ అవకాశం కోసం ఎదురు చూస్తూ మూడు రోజులు అక్కడే ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పదవి కోసం..

అంపశయ్యపై ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎంతోమంది కార్యకర్తలు, నాయకులు తమ జీవితాలను ఫణంగా పెట్టి ఊపిరి పోసి అధికారంలోకి తెచ్చిన నాయకులు ఎందరో ఉన్నారు. అలాంటివారు అధికారంలోకి రాగానే పదవి అడగడంలో తప్పులేదు. ఆ కోవాకు చెందిన వారే ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆయన కుటుంబం అంతా కాంగ్రెస్ పార్టీకి సేవచేసిన వారే. బీఆర్ఎస్‌ను ఢీ కొట్టి ఎమ్మెల్యే టికెట్ పై పోటీ చేసి గెలుపొందారు.ఆయనకు రాష్ట్ర స్థాయిలో మంత్రి పదవి ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కోరుతుంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ఆధీనంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి డాక్టర్ భూక్య మురళి నాయక్ ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. జిల్లాకు చెందిన డిసిసి అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందా రెడ్డి ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు కోరుతున్నారు. అదే కోవకు చెందిన మరో నాయకులు టిపిసిసి ప్రత్యేక ఆహ్వానితులు వెన్నం శ్రీకాంత్ రెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ నుంచి మొట్టమొదటి చేరిన నాయకులు ఆయన. ఆయనకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి ఇవ్వాలని కార్యకర్తలకు కోరుతున్నారు. అలాగే జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు నూకల నరేష్ రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాయకుల అభిప్రాయం.

గ్రంథాలయ చైర్మన్ రేసులో...

జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయ చైర్మన్ పదవి కోసం పలువురు ప్రయత్నం చేస్తుండగా ప్రధానంగా మరిపెడ సీనియర్ నాయకులు నూకల నరేష్ రెడ్డి, మహబూబాబాద్‌కు చెందిన దేవరం ప్రకాష్ రెడ్డి, దంతాలపల్లికి చెందిన సాధులింగారెడ్డి పేరు వినిపిస్తున్నాయి. ఇందులో నూకల నరేష్ రెడ్డికి ఎక్కువ అవకాశం ఉన్నట్లుగా తెలుస్తుంది.

మానుకోట మార్కెట్ ఎస్టీలకు..?

జిల్లా, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రమైన మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి రోస్టర్ విధానంలో ఈసారి గిరిజనులకు రిజర్వ్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. మార్కెట్ పరిధిలో మహబూబాబాద్ నియోజకవర్గంలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గంలోని కొరివి, డోర్నకల్ మండలాలు ఉండగా ఈ మార్కెట్ పరిధిలో చైర్మన్ పదవి డోర్నకల్ నియోజకవర్గానికి వైస్ చైర్మన్ పదవి మానుకోట నియోజకవర్గానికి కేటాయించారు. చైర్మన్ పదవి గతంలో జనరల్ మహిళ,ఎస్సి మహిళ, బీసీ జనరల్‌కు రిజర్వ్ కాగా రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఈసారి ఎస్టీలకు రిజర్వ్ అవుతుందని ప్రచారం జరుగుతుంది. ఈ క్రమంలో చైర్మన్ పదవి కోసం డోర్నకల్‌కు చెందిన గుగులోతులాలు నాయక్, కొరివికి చెందిన బాధావత్ రాము నాయక్, జనరల్ అయినట్లయితే కురవికి చెందిన అంబటి వీరభద్రం పోటీపడే అవకాశం కనిపిస్తుంది. అలాగే వైస్ చైర్మన్ పదవికి మానుకోటకు చెందిన నీరుటి లక్ష్మీనారాయణ, నాళ్ల నరసింహారావు పోటీపడుతున్నారు. డైరెక్టర్ పదవులకు వివిధ గ్రామాలకు చెందిన చోట మోటార్ లీడర్లు ప్రయత్నం చేసుకుంటున్నారు.

కేసముద్రం మార్కెట్ జనరల్ కు..?

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ జనరల్‌కు రిజర్వ్ అయినట్లుగా ప్రచారం జరుగుతుంది. అదే క్రమంలో మార్కెట్ పరిధిలో కేసముద్రం గూడూరు మరిపెడ మండలాలు ఉన్నాయి. ఇందులో మహబూబాబాద్ నియోజకవర్గానికి చెందిన వారికి చైర్మన్ పదవి, డోర్నకల్ నియోజకవర్గం మరిపెడకు చెందిన వారికి వైస్ చైర్మన్ను దక్కే అవకాశం ఉంది. చైర్మన్ పదవి కోసం గూడూరు మండలంకు చెందిన మాధవ పెద్ది రమేష్ చందర్ రెడ్డి, వేం శ్రీనివాస్ రెడ్డి, కేసముద్రం మండలం చెందిన అంబటి మహేందర్ రెడ్డి, గుగులోతు దస్రూనాయక్, సమ్మెట వెంకన్న, నెల్లికుదురు మండలానికి చెందిన యదళ్ళ యాదవరెడ్డి పోటీ పడుతున్నారు. ఇందులో మాధవపెద్ది రమేష్ చందర్‌రెడ్డికి ఎక్కువ అవకాశాలున్నట్లుగా ప్రచారం జరుగుతుంది.

తొర్రూరు మార్కెట్ జనరల్ కు..?

జిల్లాలోని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఈసారి జనరల్‌కు రిజర్వ్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. చైర్మన్ పదవి కోసం నరసింహులపేట మండలానికి చెందిన ఇర్రి లింగారెడ్డి, దంతాలపల్లికి చెందిన కీర్తి రెడ్డి నిరంజన్ రెడ్డి, జాటోత్ బట్టు నాయక్ తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

దేవాలయ కమిటీలకు పోటాపోటీ...

జిల్లాలో ఎండోమెంట్ పరిధిలో ఉన్న దేవాలయాల చైర్మన్ కమిటీ సభ్యులకు కోసం కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. నరసన్నపేట వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వేముల జయపాల్‌రెడ్డి ప్రయత్నం చేయుచుండగా జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు స్థానిక లీడర్లు పోటీపడుతున్నారు. మహబూబాబాద్‌లోని శ్రీ రామ మందిరం, శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం, శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయంతోపాటు ఇతర దేవాలయాలకు కమిటీలు వేయాలని ఎమ్మెల్యే ఇప్పటికే ఆదేశించారు.

నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



ఎలాంటి హడావుడి లేకుండా దేశంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లవడుతున్న సమయంలో, నీట్ పరీక్ష ఫలితాలు నేషనల్ టెస్టింగ్ ఎజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ముందుగా జూన్ 14న అని ప్రకటించి ముందుగానే ఎలాంటి సమాచారం లేకుండా ఫలితాలు వెల్లడించడంపై దేశవ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రధానంగా ఎన్.టి.ఎను తీసుకుని వచ్చిన నుండి దాని పారదర్శకతపై అనేక అనుమానాలు ఉన్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమార్ రాజు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. గత పరీక్షలలో ఎన్‌టీఏ చేసిన ఘోర తప్పిదాలు, అవకతవకలు మళ్లీ పునారవతం అవుతున్నాయి.నీట్ అవకతవకలుపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తున్నట్లు కుమార్‌రాజు పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు సీతక్క పరామర్శ

నవతెలంగాణ-ములుగు



ములుగు పట్టణానికి చెందిన గాదె లక్ష్మి ఇటీవలే మరణించగా వారి కుటుంబాన్ని, ములుగు గ్రామ పంచాయితీ కార్మికుడిగా పని చేస్తూ ఇటీవలే రోడ్డు జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన బలుగురి సారయ్య కుటుంబాన్ని మంత్రి సీతక్క శనివారం పరామర్శించి వారి చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. సారయ్య కుటుంబా నికి ఆర్థికసాయం అందించారు. అనంతరం ములుగు మండలం ఇంచేర్ల గ్రామానికి చెందిన కోరండ్ల నర్సింహరెడ్డి ఇటీవలే మరణించగా వారి దశదిన కర్మకు హాజరై వారి చిత్రపటం వద్ద రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఎడ్లపల్లిలో తాగునీటి ఎద్దడి..?

పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో మూడ్రోజులుగా తాగునీటి ఎద్దడి ఏర్పడిందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో ఉన్న బోర్ మోటార్ నీరు అందక, మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగడానికి, ఇతరాత్ర అవసరాలకు ఇబ్బందులకు గురివుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2వ వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని శనివారం మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లతో రోడ్డుపై ఆందోళనలు చేపట్టారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేదంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

కాటారం మండలంలోని కొండంపేట గ్రామానికి చెందిన బాల సంపత్‌రావు తన సెల్‌ఫోన్‌ను కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్నారు. వెంటనే బాధితుడు కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై భవానీసేన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఐఎంఈఐ నెంబర్‌ను బ్లాక్ చేసి భూపాలపల్లికి చెందిన వ్యక్తి దగ్గర సెల్‌ఫోన్ ఉన్నట్టు గుర్తించి రికవరీ చేశారు. శనివారం బాధితుడిని పోలీసుస్టేషన్‌కు పిలిపించి సెల్‌ఫోన్ అందజేసినట్టు ఎస్సై తెలిపారు.



గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నేడు జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నలుబాల సుమన్, డిపార్ట్మెంట్ ఆఫీసర్ వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో 360 అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులను ఉదయం 9గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని, 10 తర్వాత ఎవరిని అనుమతించమన్నారు. అభ్యర్థులందరూ నిర్ణీత సమయంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.



కొనసాగుతున్న బడిబాట

నవతెలంగాణ-మహదేవపూర్

బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బాలుర జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అనిల్, రమేష్ అడ్మిషన్స్ కోసం విద్యార్థుల వివరాలు తీసుకొని ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ పాఠశాల గొప్పతనాన్ని వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారు.

మండలంలోని ఎడపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు మడక మధు, అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై అవగాహన కల్పించారు.



చేపలకు భలే గిరాకీ

నవతెలంగాణ-గణపురం

మగశిర కార్తె సందర్భంగా శనివారం చేపల కోసం బారులు తీరారు. చేపల మార్కెట్లో మగశిర కార్తె సందర్భంగా చేపలు తింటే ఆరోగ్యాలు బాగుంటాయని, ఈ కార్తె రోజు చేపలు తినాలని క్యూ లైన్లు కట్టారు. ఇది ఆసరా చేసుకున్న వ్యాపారులు రేటు పెంచి చేపలను అమ్ముకున్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతి పట్ల 'చల్లా' సంతాపం

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



కాటారం మాజీ జెడ్పీటీసీ దుర్గం మల్లయ్య మృతి పట్ల బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శనివారం మాజీ జెడ్పీటీసీ కుటుంబ సభ్యులకు నారాయణరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

గ్రూప్-1 పరీక్షకు నిబంధనలను సడలించాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్

నవతెలంగాణ-ములుగు



రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది నిరుద్యోగులు ఆశతో ఎదురుచూస్తున్న గ్రూప్-1 ఉద్యోగాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎగ్జామ్‌కు నిబంధనలను సడలించాలని, గత ప్రభుత్వం లాగా నిమిషం ఆలస్యమైన, అర్థగంట ముందు గేట్లు మూసివేస్తామని నిబంధనని ప్రభుత్వం విరమించు కోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ శనివారం కోరారు. శనివారం పట్టణంలోని పార్టీకార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేసిన అనేక అక్రమాలు, తప్పుల వల్ల అనేకమంది నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకొని గ్రూప్-1 ఎగ్జామ్ రాస్తే పేపర్ లీకేజ్‌ల వల్ల అనేకమంది నిరుద్యోగులు నిరాశకు గురై ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ఈ ప్రభుత్వమైనా ఈ గ్రూప్-1 పరీక్షను సక్రమంగా నిర్వహించాలని కోరారు. గత ప్రభుత్వం పెట్టిన ఒక నిమిషం ఆలస్యం నిబంధనను తీసి వేయాలని, ఆ నిబంధనను తీసివేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అర్ధగంట ముందే ఎగ్జామ్స్ సెంటర్ల గేట్లు మూసివేస్తామని ప్రకటించడం హేయమైన చర్య అన్నారు. సుదూర ప్రాంతాల్లో ఉండే ఎంతో మంది నిరుద్యోగులు పరీక్ష కేంద్రానికి అర్ధగంట ముందుగా చేరుకోవాలంటే ఇబ్బంది ఉంటుందని, కాబట్టి అర్ధగంట ముందు గేట్లు మూసివేస్తాం, నిమిషం ఆలస్యమైతే అనుమతి ఉండదనే నిబంధనలను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 25శాతం ఉచిత విద్య అందించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్ రవి

నవతెలంగాణ-ములుగు



2009 విద్య హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీపీ విద్యార్థులకు 25శాతం ఉచిత విద్యని అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్ రవి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్ రవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. జిల్లాలో అనుమతులు లేకుండా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని అన్నారు. ఈ సంవత్సరం పూర్తి చేసిన పదో తరగతి విద్యార్థుల దగ్గర నుండి స్టడీస్ సర్టిఫికెట్, టీసీ పేరుతో పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ అధికారుల పర్మిషన్ లేకుండా పాఠశాలలు నడుపుతూ ఎల్కేజీ చదివే విద్యార్థులకే రూ.20వేల పైన ఫీజులు దండుకుంటున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాల విద్యార్థులకు 25శాతం ఉచితంగా విద్యను అందించాలని, పాఠశాలలో యూనిఫామ్ నోట్ బుక్స్ అమ్మకాలను నిషేధించాలని, గుర్తింపు లేని పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్న అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, సింహాద్రి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులు కేసుల్లో రాజీ కుదుర్చుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎస్విపి సూర్యచంద్రకళ

నవతెలంగాణ-ములుగు



కక్షిదారులు తమ కేసులను రాజీ కుదుర్చుకొని ప్రశాంతమైన జీవనాన్ని గడపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎస్విపి సూర్య చంద్ర కళ తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల అనుసారం శనివారం ములుగు జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎస్విపి సూర్య చంద్రకళ జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజీ మార్గమే రాజా మార్గమని, ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను రాజీ కుదుర్చుకొని, ప్రశాంతమైన జీవనాన్ని గడపాలన్నారు. లోక్ అదాలత్ తమ కేసులను రాజీ చేసుకుంటే అప్పీల్ ఉండదని, ఇదే అంతిమ తీర్పు అని తెలిపారు. ఈ సందర్భంగా లోక్‌అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, కోర్టు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాక్షిదారులకు 100 పులిహోర పాకెట్స్ పంపిణి చేశారు. ఈ లోక్ అదాలత్‌లో మూడు బెంచీలను ఏర్పాటు చేసి (323) మొత్తం పెండింగ్ కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి కన్నయ్యలాల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామమోహన్‌రెడ్డి, ఎస్పీ పి శబరిష్, డీఎస్పీ రవీందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం వినయ్‌కుమార్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పావని, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పి. ప్రసాద్, సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, న్యాయవాదులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

తోళ్లపాయ రోడ్డుకు మరమ్మతులు ప్రారంభం

రైతులకిచ్చిన మాట నిలుపుకున్న మంత్రి దుద్దిళ్ల

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండలంలోని తోళ్లపాయ రోడ్డుకు మరమ్మతులు ప్రారంభం కావడంతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రైతులకిచ్చిన మాట నిలబెట్టుకున్నారనిరైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల తాడిచెర్లలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు తోళ్లపాయ రైతులు రోడ్డుపై గుంతలు, ఇరువైపులా ముళ్ల పొదలు ఉండటంతో ఇబ్బందులకు గురివుతున్నామని, ఎడ్లబండ్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లక ఎరువులు, విత్తనాలు నెత్తిన ఎత్తుకొని పోతున్న దుస్థితి నెలకొందని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరగా తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎన్నికల కోడ్ ముగియగానే రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా శనివారం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు, ఏఎమ్మార్ కంపెనీ సహకారంతో తోళ్లపాయ రోడ్డుకు మరమ్మతుల పనులు ప్రారంభించినట్టు భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సిసెల్ అధ్యక్షుడు దండు రమేష్, మంత్రి సహచరుడు ప్రవీణ్ కుమార్, యూత్ కాంగ్రెస్ డివిజన్ నాయకుడు మండల రాహుల్, కేశారపు చంద్రయ్య, కుంట సది, జంజర్ల ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు మాట ఇస్తే తప్పకుండా అభివద్ధి పనులు చేస్తారని, మాట ఇచ్చి తప్పడం దుద్దిళ్ల కుటుంబంలో లేదన్నారు. ఈ రోడ్డు మరమ్మతులతో శాత్రజ్‌పల్లి వరకు సాఫీగా వెళ్లవచ్చన్నారు. రోడ్డు వెడల్పు, మరమ్మతులకు రైతులు సహకరించాలనికోరారు. రోడ్డు పనులతో రైతుల 25ఏళ్లుగా అనుభవిస్తున్న ఇబ్బందులు తిలగడమే కాకుండా, భూములను సైతం విలువలు పెరుగు తాయన్నారు. మాట ఇచ్చిన ప్రకారం రోడ్డు పనులు చేపట్టిన మంత్రి శ్రీధర్‌బాబుకు రైతులు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపి ఆనందం వ్యక్తం చేశారు.

రెడ్‌మిక్స్ యాజమాన్యం ప్రజల మన్ననలు పొందాలి



రెడ్‌మిక్స్ ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క



నవతెలంగాణ-ములుగు

ములుగు మండలంలోని జాకారం గ్రామంలో ఎస్సార్ఎఫ్ రెడ్‌మిక్స్ (ఆర్ఎంసీ) ప్లాంట్‌ను రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివద్ధి స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్లాంట్ యాజమాన్యం నాణ్యత ప్రమాణాలు పాటించి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని ములుగు జిల్లా కేంద్రానికి దగ్గర ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చెయ్యడం శుభాపరిణామమని అన్నారు. గతంలో వరంగల్ నుండి రెడ్‌మిక్స్ తెచ్చుకోవాలంటే ప్రజలపై కొంత ఆర్థికభారం పడేదని, దీన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా యూత్ అధ్యక్షులు బానోతు రవిచందర్, మండల అధక్షులు ఎండి చాంద్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్, ములుగు పట్టణ అధ్యక్షులు చింతలపల్లి బిక్షపతి, జాకారం గ్రామ పార్టీ అధ్యక్షులు ఎండి లాల్ పాషా, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సఖి సేవలపై 'లింగాలలో' అవగాహన

నవతెలంగాణ-తాడ్వాయి

సఖి సేవలపై మండలంలోని లింగాల గ్రామపంచాయతీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సఖి కేంద్రం నిర్వాహకులు మాట్లాడుతూ నిరుపేదలకు, అభాగ్యులకు, మహిళలకు, పిల్లలకు, సంవత్సరాదాయం మూడు లక్షలు మించని వారికి సఖి కేంద్రం ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. సఖి కేంద్రం ద్వారా కౌన్సెలింగ్ సేవలు, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి మొదలైన ఐదు రకాల సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, మహిళలు, బాలికల చట్టాలు, గహహింస చట్టం, సైబర్ క్రైమ్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాలలో 181,100, 1098, 1930 హెల్ప్ లైన్ నెంబర్ల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ కౌన్సిలర్ కల్పన, పారా మెడికల్ స్టాఫ్ రాధా, కేస్ వర్కర్ మౌనిక, ఐటి అసిస్టెంట్ కిరణ్, లింగాల మాజీ సర్పంచ్ ఊకే కే మౌనిక నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఊకే ప్రసాద్, గ్రామస్తులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-మొగుళ్లపల్లి

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇస్సిపేట గ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్సిపేట గ్రామానికి చెందిన యార రాజిరెడ్డి (58)వడ్లు పట్టించడానికి అదే గ్రామానికి చెందిన పండుగ శ్రీధర్ టాటా ఏసీ ట్రాలీలో ఇంటి వద్ద ఉన్న వడ్ల బస్తాలను రైస్‌మిల్లుకు తీసుకుపోవడానికి ట్రాలీ తెప్పించాడు. ఇంటి దగ్గర వడ్ల బస్తాలను ట్రాలీలో లోడ్ చేయడానికి ట్రాలీ వెనుకకు వస్తున్న క్రమంలో ఇంటి ముందు రేకుల షెడ్డు మీదుగా ఉన్న కరెంటు వైర్‌ను ట్రాలీకి తగలకుండా పైకి లేపే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై రాజిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పట్టభద్రులందరికీ ధన్యవాదాలు

తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కిషన్

నవతెలంగాణ-ములుగు

హైదరాబాద్‌లో క్యూ న్యూస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను శనివారం తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అచ్చునూరి కిషన్ మర్యాదపూర్వకంగా కలిసి హార్దిక శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. అనంతరం క్యూ న్యూస్ కార్యాలయంలో క్యూ న్యూస్‌కో, యాంకర్ సుదర్శన్‌గౌడ్, మేనం శ్యాంతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా సంబురాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం అహర్నిశలు కషి చేసిన వారందరికీ కతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రుల ఆశయాలు నెరవేర్చే విధంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పెద్దల సభలో మీ గొంతుకగా నిలిచి, మీ సమస్యల సాధనకై కషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా తీన్మార్ మల్లన్న టీమ్ సీనియర్ నాయకులు తుప్పతి శ్రీనివాస్, వనపర్తి జిల్లా తీన్మార్ మల్లన్న టీమ్ జిల్లా అధ్యక్షుడు దండే విజయ్ యాదవ్, మచ్చ సందీప్, బండారి ప్రవీణ్, శంకబుద్ధి భాస్కర్ పాల్గొన్నారు.

రామోజీరావు మృతి

తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు : సీతక్క

నవతెలంగాణ- ములుగు

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో నానక్‌గూడలోని స్టార్ హాస్పిటల్ చికిత్స పొందుతూ మతి చెందగా ఆయన మతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) శనివారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రామోజీరావు ఈనాడు సంస్థలు, మార్గదర్శి చిట్‌ఫండ్స్, ప్రియాఫుడ్స్ వంటి వ్యాపారాలు నెలకొల్పి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారనీ, అంతేగాక రామోజీ ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేసి హైదరాబాద్, సినీ పరిశ్రమ అభివద్ధిలో భాగమయ్యారని ఆయన మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ

గోవిందరావుపేట : ఈనాడు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు మతి పట్ల కమ్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘన నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని కమ్మ సంఘం కళ్యాణమండపంలో మండల కమ్మ సంఘం అధ్యక్షుడు పాలడుగు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో తెలంగాణ కమ్మ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రామోజీరావు సేవలు చిరస్మరణీయమని అన్నారు.



వాజేడు : వాజేడు మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు అరికెళ్ల వేణు ఆధ్వర్యంలో అక్షర యోధుడు ఈనాడు అధినేత రామోజీరావుకు ఘన నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని హనుమాన్ సెంటర్‌లో రామోజీరావు చిత్రపటానికిపూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, ఈనాడు విలేఖరి నరసింహారావు చిత్రపటం ముందు దీపం వెలిగించి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి దామోదర్, సీనియర్ విలేఖరి గంట సర్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎస్.కె మహబూబ్ పాషా, మండల విలేకర్లు పాల్గొన్నారు.